Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 285 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 నవంబర్ 2023 శుక్రవారం పేజీలు : 4


## మణిపూర్‌లో ఇంటర్నెట్‌పై నిషేధం పొడిగింపు


ఇంఫాల్ : మణిపూర్‌లో మొబైల్ ఇంటర్నెట్‌పై నిషేధాన్ని ప్రభుత్వం ఈనెల 5వ తేదీ వరకు పొడిగించింది. గతంలో ప్రభుత్వం మొబైల్ ఇంటర్నెట్‌పై విధించిన నిషేధం అక్టోబరు 31తో ముగిసింది. మోరెహ్ పట్టణంలో సీనియర్ పోలీసు అధికారి చింగ్తం ఆనంద్‌ను తిరుగుబాటుదారులు స్నైపర్‌తో కాల్చి చంపిన నేపథ్యంలో మొబైల్ ఇంటర్నెట్‌పై నిషేధాన్ని ప్రభుత్వం మరో 5 రోజులు పొడిగించింది. సంఘ విద్రోహ శక్తులు సోషల్ మీడియా ద్వారా హానికరమైన సందేశాలు, వీడియోలు వైరల్ చేయకుండా నిరోధించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. కాగా, మణిపూర్ సీఎం ఆఫీసు సమీపంలో పోలీస్‌స్టేషన్‌ను ప్రజలు ముట్టడించారు. పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. దరిమిలా ఇంఫాల్‌లో మళ్లీ కర్ఫ్యూ విధించారు.

# కాళేశ్వరాన్ని ఏటీఎంలా వాడేశారు

## బీఆర్ఎస్ ప్రభుత్వం పై రాహుల్ సంచలన వ్యాఖ్యలు..!!





జయశంకర్ భూపాలపల్లి: ప్రజల సంపదను బీఆర్ఎస్ ప్రభుత్వం దోచుకుంటోందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్ పార్టీకి ఏటీఎంగా మారిందని ఆరోపించారు. తెలంగాణలో లక్షల కోట్ల రూపాయల ప్రజల సొమ్ము దోపిడీ జరిగిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాలో జమ చేస్తామని చెప్పుకొచ్చారు.

మేడిగడ్డ ప్రాజెక్టును రాహుల్ పరిశీలించారు. లక్ష కోట్ల రూపాయలతో నిర్మించిన బ్యారేజీ రెండేళ్లలోనూ దెబ్బతినడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.

**మేడిగడ్డ పరిశీలించిన రాహుల్ :** మేడిగడ్డ ప్రాజెక్టును కాంగ్రెస్ నేత రాహుల్ పరిశీలించారు. మహదేవ్‌పూర్ మండలం అంబటిపల్లిలో నిర్వహించిన మహిళా సాధికారత సదస్సుకు రాహుల్ గాంధీ హాజరై ప్రసంగించారు. దొరల తెలంగాణ, ప్రజల తెలంగాణ మధ్య జరుగుతున్న ఎన్నికలు అని పేర్కొన్నారు. నిధుల దోపిడీ, నిర్మాణంలో అక్రమాల వల్లే ఇలా జరిగిందని ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టు పనులు నాసిరకంగా ఉన్నాయని విమర్శించారు. దర్యాప్తు సంస్థల అధినేత అమిత్‌షా అవినీతిపై మోదీ చర్యలు తీసుకోలేదని రాహుల్ పేర్కొన్నారు. తెలంగాణలో పెద్ద ఎత్తున జరుగుతున్న దోపిడీ, అన్యాయాన్ని చూసేందుకే వచ్చినట్టు చెప్పారు. బీఆర్ఎస్ పాలనలతో ఈ తొమ్మిదిన్నరేండ్లలో లక్ష కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు బీఆర్ఎస్‌కు, కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు ఏటీఎంలా మారిందని విమర్శించారు. దోచుకోవడం.. దాచుకోవడంలో ఉన్న శ్రద్ధ కేసీఆర్‌కు మరి దేనిపై లేదన్నారు.

**మహిళలు నష్టపోన్నారు :** రాష్ట్ర సంపదను కేసీఆర్ దోచుకోవడం వల్ల మహిళలు ఎక్కువగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం ఒకవైపు.. కాంగ్రెస్ మరోవైపు ఉందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కు బీజేపీ, ఎంఐఎం సహకరిస్తున్నాయని తెలిపారు. ఎన్నికల్లో కాంగ్రెస్ కు పూర్తి మద్దతు ఇచ్చి బీఆర్ఎస్ ను గద్దె దింపాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

బ్యారేజీ పరిశీలనకు పోలీసులు ఇతరులెవరికీ అనుమతి ఇవ్వలేదు. కాంగ్రెస్ కార్యకర్తలను బ్యారేజీ వద్దకు వెళ్లకుండా అడ్డుకున్నారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. వాటిని తోసుకుంటూ బ్యారేజీ వైపు దూసుకెళ్లే ప్రయత్నం చేసిన కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

**దొరలు వర్సస్ ప్రజలు :** ఈ ఎన్నికలు దొరల తెలంగాణ కు ప్రజల తెలంగాణకు మధ్య జరుగుతున్నాయని రాహుల్ చెప్పుకొచ్చారు. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతీ మహిళకు నెలకు రూ.2500 అందిస్తామని హామీ ఇచ్చారు.

మోదీ, కేసీఆర్ పాలనలో సిలిండర్ ధర రూ.12 వందలకు చేరిందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామని చెప్పారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పుకొచ్చారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ను గెలిపించి ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని రాహుల్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మీకు ఇచ్చిన హామీలు నెరవేరస్తామన్నారు. దొరల సర్కారును పారదోలి ప్రజల సర్కార్ ను ఏర్పాటు చేయాలన్నారు.

## తెలంగాణ ఎన్నికలకు పరిశీలకుల నియామకం..

### ఈ నెల 10 నుంచి రంగంలోకి..



దిల్లీ: తెలంగాణ శాసనసభ ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం పరిశీలకులను నియమించింది. ఇతర రాష్ట్రాలకు చెందిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు పరిశీలకులుగా బాధ్యతలు అప్పగించింది. 67 మంది ఐఏఎస్ అధికారులను సాధారణ పరిశీలకులుగా నియమించారు. ఎన్నికల నిర్వహణా ప్రక్రియను ఆయా నియోజకవర్గాల్లో వీరు పర్యవేక్షించనున్నారు. 39 మంది ఐపీఎస్ అధికారులను పోలీసు పరిశీలకులుగా నియమించారు. వీరు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లో శాంతిభద్రతల నిర్వహణ, సంబంధిత అంశాలను పర్యవేక్షిస్తారు. సాధారణ పరిశీలకులు, ఎన్నికల పరిశీలకులు ఈ నెల 10 నుంచి రంగంలోకి దిగనున్నారు. ఇప్పటికే 60 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఏఎస్ అధికారులను వ్యయ పరిశీలకులుగా ఈసీ నియమించింది. నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రారంభంతో వ్యయ పరిశీలకులు శుక్రవారం నుంచి రంగంలోకి దిగనున్నారు.




హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఎన్నికలకు అభ్యర్థుల మూడో జాబితాను భారతీయ జనతా పార్టీ విడుదల చేసింది. మొత్తం 35 మందితో జాబితాను వెల్లడించింది. ఇప్పటికే రెండు జాబితాలను కమలం పార్టీ విడుదల చేసింది.

**అభ్యర్థులు వీళ్లే..** 1. మంచిర్యాల– వీరబెల్లి రఘునాథ్ 2. ఆసిఫాబాద్ (ఎస్టీ) – అజ్మీరా ఆత్మారాం నాయక్ 3. బోధన్ – వడ్డి మోహన్‌రెడ్డి 4. బాన్సువాడ – యెండల లక్ష్మీనారాయణ 5. నిజామాబాద్ రూరల్ – దినేశ్ కులాచారి 6. మంథని – చందుపట్ల సునీల్‌రెడ్డి 7. మెదక్ – పంజా విజయ్‌కుమార్ 8. నారాయణ్‌ఖేడ్ – జనవాడె సంగప్ప 9. అందోల్ (ఎస్సీ)– పల్లి బాబూమోహన్ 10. జహీరాబాద్ (ఎస్సీ) – రామచంద్ర రాజ నరసింహా 11. ఉప్పల్ – ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ 12. ఎల్బీనగర్ – సామ రంగారెడ్డి 13. రాజేంద్రనగర్ – తోకల శ్రీనివాస్‌రెడ్డి 14. చేవెళ్ల (ఎస్సీ) – కేఎస్ రత్నం 15. పరిగి – బోనేటి మారుతి కిరణ్ 16. ముషీరాబాద్ – పోస రాజు 17. మలక్‌పేట్ – శ్యామ్‌రెడ్డి సురేందర్‌రెడ్డి 18. అంబర్‌పేట – కృష్ణ యాదవ్ 19. జూబ్లీహిల్స్ – లంకల దీపక్ రెడ్డి 20. సనత్‌నగర్ – మర్రి శశిధర్‌రెడ్డి 21. సికింద్రాబాద్ – మేకల సారంగపాణి 22. నారాయణ్‌పేట్ – రతంగ్ పాండురెడ్డి 23. జడ్చర్ల – చిత్తరంజన్ దాస్ 24. మక్తల్ – జలంధర్‌రెడ్డి 25. వనపర్తి – అశ్వత్థామరెడ్డి 26. అచ్చంపేట (ఎస్సీ) – దేవని సతీశ్ మాదిగ 27. షాద్‌నగర్ – అందె బాబయ్య 28. దేవరకొండ (ఎస్టీ)– కేతావత్ లాలూ నాయక్ 29. హుజూర్‌నగర్ – చల్ల శ్రీలతారెడ్డి 30. నల్గొండ– మాదగాని శ్రీనివాస్‌గౌడ్ 31. ఆలేరు – పడాల శ్రీనివాస్ 32. పరకాల – కాలి ప్రసాద్‌రావు 33. పినపాక (ఎస్టీ) – పొడియం బాలరాజు 34. పాలేరు – నున్న రవికుమార్ 35. సత్తుపల్లి (ఎస్సీ)– రామలింగేశ్వరరావు



# మేం మా జనాలకు కాపలాదారులం

# అందుకే ఆలోచించి ఓటేయండి

## నిర్మల్ బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్

నిర్మల్ : ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీ గెలవాలి.. అప్పుడే ప్రజల కోరికలు తీరుతాయి.. అందుకే ఆలోచించి ఓటేయాలి అని సీఎం కేసీఆర్ ప్రజలకు పిలుపునిచ్చారు. నిర్మల్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ వచ్చిన తర్వాత మూడోసారి రాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఎలక్షన్లు వస్తాయి పోతాయి.. ఎన్నికలు అన్నప్పుడు అన్ని పార్టీల అభ్యర్థులు పోటీ చేస్తారు. అందర్నీ ఒకటే ప్రార్థిస్తున్నాను. 75 ఏండ్ల స్వతంత్ర దేశంలో ఇప్పటికి ప్రజాస్వామ్య పరిణితి రాలేదు. ఏ దేశాల్లో అయితే అది వచ్చిందో ఆ దేశాలు ముందుకు దూసుకుపోతున్నాయి. ఎన్నో రెట్లు ముందు ఉన్నాయని కేసీఆర్ తెలిపారు. నేను చెప్పే మాటలను గ్రామాల్లో, బస్తీల్లో చర్చ పెట్టాలని కేసీఆర్ సూచించారు. కారణం ఏందంటే.. ఎలక్షన్లు వచ్చాయి. రెండో మూడో నాలుగో పార్టీలు పోటీ చేస్తాయి. ఇంద్రకరణ్ రెడ్డి లాగా ఇతర పార్టీల నుంచి కూడా ఎవరో ఒకరు పోటీలో ఉంటారు. 30న ఓట్లు వేస్తారు. 3న లెక్క తీస్తారు. ఎవరో ఒకరు గెలుస్తరు. ప్రజాస్వామ్య దేశంలో పార్లమెంటరీ డెమోక్రసీలో ప్రజలకు ఒక వజ్రాయుధం ఓటు. మీ ఓటు మీ తలరాతను లిఖిస్తది వచ్చే ఐదేండ్లు. పార్టీల అభ్యర్థులు మంచి చెడు తెలుసుకోవాలి. అభ్యర్థులు గెవడంతో ప్రభుత్వం ఏర్పడతుంది. ఏ ప్రభుత్వం ఏర్పడితే లాభమేనేది చర్చ జరగాలి. ప్రతి పార్టీ చరిత్ర చూడాలి. ఆయా పార్టీల హాయాంలో ఏం జరిగిందో ఆలోచించాలి. ఎన్నికలు రాగానే ఆగమాగం కావొద్దు.. పార్టీ వైఖరి తెలుసుకోవాలి. ఏ పార్టీ ప్రజల గురించి ఆలోచిస్తది.. నడవడి ఎట్ల ఉన్నది అనేది గమనించాలి. అప్పుడు ఎన్నికల్లో ప్రజలు గెలుస్తరు. ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే పార్టీ గెలుస్తే మీ కోరికలు నెరవేరుతాయి అని కేసీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ పుట్టిందే ప్రజల కోసం, హక్కుల కోసం, నీళ్లు, నిధులు, నియామకాల కోసం అని కేసీఆర్ తెలిపారు. తెలంగాణ ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లో నష్టం రాకుండా ఉండాలని ఆలోచించే కాపలదారే బీఆర్ఎస్. ప్రజల హక్కుల కోసం 15 ఏండ్లు నిర్విరామంగా పోరాడి, చివరకు చావు నోట్లో తలకాయపెట్టి సాధించుకున్నాం. రెండు సార్లు బీఆర్ఎస్‌ను ఆశీర్వదించారు. తెలంగాణ రాకపోతే నిర్మల్ జిల్లా అయ్యేదా..? ఇవన్నీ ఆలోచించాలి. నిర్మల్ జిల్లాను చేయించింది ఇంద్రకరణ్ రెడ్డినే. ఆదిలాబాద్ జిల్లాలో ఏం చేద్దాం ఎన్ని జిల్లాలు చేద్దామని ఆలోచించాం. ఆదిలాబాద్‌తో పాటు మంచిర్యాల చేయాలని నిర్ణయించాం. ఇంద్రకరణ్ రెడ్డి మళ్లీ గంట తర్వాత వచ్చారు. బాసర నుంచి ఆదిలాబాద్, బెజ్జూరు నుంచి ఆదిలాబాద్ రావాలంటే చాలా సమయం పడుతది. కాబట్టి నాలుగు జిల్లాలు చేయాలని అడిగారు. నిర్మల్, ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలు కావాలని గంటసేపు వాదించారు. ఈ నాలుగు జిల్లాలు చేసిందే ఇంద్రకరణ్ రెడ్డినే. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లా ప్రజలు చేయెత్తి దండం పెడుతున్నారు. నాలుగు మెడికల్ కాలేజీలు వచ్చాయి. ఇవాళ ఇంజినీరింగ్ కాలేజీ కావాలని అడిగారు. తను పుట్టిన ప్రాంతం మీద ప్రేమ ఉంది కాబట్టి.. ఒకదాని తర్వాత ఒకటి అడుగుతున్నాడు ఇంద్రకరణ్ రెడ్డి. ఈ సభతో ఇంద్రకరణ్ రెడ్డి గెలిచిండని తెలిసిపోయింది. ప్రజల కోసం తండ్లాడే వ్యక్తి. నిర్మల్ చాలా అభివృద్ధి జరిగింది. ఇంజినీరింగ్ కాలేజీ పెద్ద విషయం కాదు.. ఇంద్రకరణ్ రెడ్డి మెజార్టీ 70 వేలు దాటాలి.. కచ్చితంగా జేఎన్టీయూ నుంచి ఇంజినీరింగ్ కాలేజీ ఇప్పించే బాధ్యత నాది అని కేసీఆర్ పేర్కొన్నారు. విజ్ఞత గల తెలంగాణ పౌరులారా కేసీఆర్ లాంటి కాపలాదారుడు కావాల్నో... కాంగ్రెస్ కాలకేయులు కావాల్నో ఆలోచించండి అంటూ ప్రసంగాన్ని ముగించారు.

## సంపాదకీయం

# ఎక్కువ గంటలు పని చేస్తే ఏమవుతుంది? నివేదికలు ఏం చెబుతున్నాయి?

వారానికి 70 గంటలు పని చేయాలంటూ దిగ్గజ ఐటీ సంస్థ ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి నోటి నుంచి వచ్చిన మాట ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది. ఉద్యోగులు వారానికి 70 గంటలు అంటే.. ఇంచుమించు రోజుకు 13-14 గంటలు పని చేయాలన్న మాటపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. వారానికి 70 గంటలు అంటే.. వారంలో రెండు వీక్ ఆఫ్ లను పరిగణలోకి తీసుకుంటే.. మిగిలేది 5 రోజులు. అంటే.. రోజుకు 14 గంటలు. మధ్యలో భోజన విరామం.. ఇంటి నుంచి ఆఫీసుకు, ఆఫీసు నుంచి ఇంటికి వచ్చి వెళ్లటాన్ని లెక్కలోకి తీసుకుంటే.. దీనికి కనిష్ఠంగా 2.30 గంటలు గరిష్ఠంగా నాలుగు గంటలు. సరాసరిన మూడు గంటలు వేసుకుంటే.. రోజులోని 24 గంటల్లో ఆఫీసులో పని.. దాని చుట్టూనే 18-19 గంటలు పని చేయాల్సి ఉంటుంది. మరి.. అప్పుడు వ్యక్తిగత జీవితం మాటేమిటి? అన్నది అసలు ప్రశ్న. ఇన్ఫోసిస్ పెద్దాయన వ్యాఖ్యల నేపథ్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఎన్ని గంటల చొప్పున పని చేస్తున్నారు? వారానికి 70గంటలు పని చేస్తే ఏమవుతుంది? లాంటి విషయాల్లోకి వెళితే.. దిమ్మ తిరిగే వాస్తవాలు బయటకు వస్తాయి. ఎక్కువ పని గంటలతో ఎక్కువ ప్రొడక్షన్ అన్నది కాలం చెల్లిన మాటగా చెప్పాలి. ఇలాంటి సమయంలో పని చేస్తున్నట్లు కనిపించినా.. ఉత్పాదకత మీద ప్రభావాన్ని చూపుతుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉద్యోగుల చేత పని చేయించే విధానం చూస్తే.. సరాసరిన వారానికి 49 గంటలు మాత్రమే పని చేయిస్తున్నాయి. భారతదేశం విషయానికి వస్తే.. రోజువారీ విశ్రాంతి సమయం.. వార్షిక సెలవులు కలిపితే వారానికి 48 గంటలకు మించకుండా చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే.. సరాసరిన 40-44 గంటల మధ్యనే ఉద్యోగులు పని చేయాల్సి ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా అతి తక్కువ పనిగంటలు ఉన్న దేశం జర్మనీ. ఈ దేశంలో ఏడాదిలో 1340 గంటలు పని గంటలుగా ఫిక్సు చేస్తారు. అదే సమయంలో ఎక్కువ పని గంటలు అమలుచేసే దేశాల్లో మెక్సికో.. కొలంబియా.. కోస్టారికాలో ఏడాదికి 1886 గంటల పాటు పని చేయాల్సి ఉంటుంది. 2016 ప్రపంచ ఆరోగ్య సంస్థ.. అంతర్జాతీయ కార్మిక సంస్థల అధ్యయనం ప్రకారం.. ఎవరైతే వారానికి 55 గంటలు దాటి పని చేస్తారో.. వారిలో ప్రతి పది మందిలో ఒకరు గుండెపోటుతో మరణిస్తారని హెచ్చరించింది. ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు గుండెపోటుతో మరణించారంటే.. అత్యధిక భాగం ఎక్కువ గంటలు పని చేయటం కూడా కారణంగా చెబుతారు. భారత కార్మిక మంత్రిత్వ శాఖ రోజుకు 12 గంటల పని ఉండాలని పార్లమెంటులో చట్టం చేసినా..ఇండియన్ ఫ్యాక్టరీస్ యాక్ట్ 1948 ప్రకారం ఓవర్ టైంతో కలిపి 50-60 గంటల పని గంటలు దాటకూడదన్న నిబంధనల్ని పాటిస్తున్నారు. ఎక్కువగా పని చేయటం.. మరింత ఎక్కువగా ఒత్తిడిని పెంచటమేనన్న మాట వినిపిస్తోంది. ఇన్ఫోసిస్ పెద్దాయన ఇవేమీ తెలీకుండానే మాట్లాడారా? అన్నదిప్పుడు ప్రశ్న.

# నేటి నుంచి (ఈనెల 3వ తేదీ) జిల్లాలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

**నామినేషన్ సంబంధించి నిబంధనలు, వివరాలను వెల్లడించిన మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్**



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో :- తెలంగాణలో రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం (ఈనెల 3వ తేదీ) నుంచి ప్రారంభమవుతుందని.. నామినేషన్లకు సంబంధించిన అన్ని విషయాల్లో పోటీ చేసే అభ్యర్థులు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఎన్నికల సంఘం సూచనలు తప్పకుండా పాటించాలని మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల కానుందని జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ నెల 3 నుండి 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 13 న నామినేషన్ల పరిశిలన, 15 న నామినేషన్ల ఉపసంహారణ అనంతరం అదే రోజు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రకటించబడుతుందని తెలిపారు. ఈ నెల 30 న పోలింగ్, డిసెంబర్ 3 న ఓట్ల లెక్కింపు ఉంటుందని అన్నారు.

నామినేషన్లను ఈ నెల 3 నుండి 10 వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాన్నం 3 గంటల వరకు ఆయా నియోజక వర్గాలలోని రిటర్నింగ్ అధికారులు స్వీకరిస్తారని ఆయన తెలిపారు.

# వయోవృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచే ఓటు హక్కు సౌలభ్యం...

**మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్**



గరుడ వార్త మేడ్చల్ జిల్లా బ్యూరో :- తెలంగాణ రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి వయోవృద్ధులు, దివ్యాంగులకు వారి ఇంటి నుండే ఓటు హక్కు వినియోగించుకోవడానికి సౌలభ్యం కల్పించిందని మేడ్చల్ %--% మల్కాజిగిరి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ఎన్నికల కమిషన్ అనుమతించిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం వయోవృద్ధులైన ఓటర్లు 32,921 మంది ఉండగా దివ్యాంగులైన ఓటర్లు మొత్తం 24,751 ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వయోవృద్ధులు, దివ్యాంగులు ఇంటి వద్ద నుండే ఓటు హక్కు కల్పించడానికి అధికార యంత్రాంగం చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఇంటి నుండే ఓటు హక్కు వినియోగించుకునే 80 ఏళ్లకు పై గల వయోవృద్ధులు, 40 శాతం కన్నా మించి ఉన్న దివ్యాంగులు ఓటరు జాబితాలో ఓటరుగా నమోదైన వారు ఫారం-%--%12 (డీ) లో తమ పూర్తి వివరాలను నమోదు చేసి నవంబర్ 7వ తేదీలోగా ఆయా బూత్ స్థాయి అధికారులకు (బీఎల్వోలకు) అందించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ వివరించారు. అలా ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న వారికే ఇంటివద్ద నుండి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఆయా సంబంధిత రిటర్నింగ్ అధికారులు కల్పిస్తారని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకుంటానని తెలిపిన వారికి ఫారం%--%-12 (డీ) ఇవ్వడం జరగదని స్పష్టం చేశారు.. ఇంటి వద్ద నుంచి ఓటు హక్కు వినియోగించుకునే వారి వద్దకు రెండు రోజులు ముందు పోలింగ్ అధికారులు, వీడియో గ్రాఫర్, పోలీసులతో వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా వారు తమ ఓటు హక్కు ను వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు కంపార్టుమెంట్ను ఏర్పాటు చేస్తారని, సదరు ఓటర్లు రహస్యంగా ఓటు హక్కు వినియోగించుకుని బ్యాలెట్ బాక్సులో వేయాల్సి ఉంటుందని, ఈ ప్రక్రియ అంతా వీడియో కవరేజి చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయంలో ఒకవేళ మొదటి రోజు ఓటు హక్కు వినియోగించుకోని పక్షంలో మరొక రోజు ఓటు వేసుకునేందుకు అవకాశం కల్పిస్తారని, ఇలా రెండుసార్లు మాత్రమే వీలు కల్పించడం జరుగుతుందని వివరించారు.

జిల్లాలోని అర్హత గల వయోవృద్ధులు, దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగుల సౌకర్యం కోసం ర్యాంపులు, వయోవృద్ధుల కోసం వీల్ చైర్స్, వాకింగ్ స్టిక్స్ లతో పాటు అటెండర్ ను అందుబాటులో ఉంచుతామని తెలిపారు.

# మేడ్చల్ ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కడతారు...

**బోమ్మలపల్లి నర్సింహులు యాదవ్**

శామీర్ పేట (గరుడ వార్త):- ఈసారి మేడ్చల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ తప్పక విజయం సదిస్తుందని మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ పార్టి అద్యుక్షులు బోమ్మలపల్లి నర్సింహులు యాదవ్ అన్నారు. గురువారం మెడ్చల్ నియెజకవర్గం మూడుచింతలపల్లి మండలం పరిదిలోని లక్ష్మాపూర్ గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టి అద్యుక్షులు బోమ్మలపల్లి నర్సింహులు యాదవ్, మండల వైస్ ప్రెసిడెంట్



రామిడి శాశిందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కిసరి నర్సింహులు, పట్ట బాల్ నర్సింహలు అందరు కలిసి నూతన కాంగ్రెస్ పార్టి కార్యాలయాన్ని ప్రారంబించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మపూర్ గ్రామ అద్యక్షులు దండు రాజు , ప్రదన కార్యదర్శి కొమ్ము లక్ష్మణ్,కటికెల గోపి, చిన్న లచ్చు బాల్ నర్సింహ, మురలి, శంకర్, రామక్రిష్ణ, హిరాలల్ నాయక్, నర్సింహ, మల్లెష్ యాదవ్, బోమ్మలపల్లి శెకర్ యాదవ్ ,పరశురామ్ నాయక్,కుమార్,ప్రభకర్ రెడ్డి ,లక్ష్మణ్ నాయక్,బాబు నాయక్ ,మల్లెష్ నాయక్, మెహన్ తదితర కాంగ్రెస్ పార్టి కార్యకర్తలు పాల్గోనారు.

# కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే, మంత్రి మల్లారెడ్డి అన్యాయాలను అరికడతాం...

**తోటకూర వజ్రేష్ యాదవ్**

శామీర్ పేట (గరుడ వార్త):- మంత్రి మల్లారెడ్డి అన్యాయాలను అరికట్టి, ప్రజలకు మేలైన పాలన అందించడమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ శాసనసభ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. గురువారం మూడు చింతలపల్లి మండల పరిధిలోని అదరాస్ పల్లి, జగన్ గూడా, కొలతూర్, మూడు చింతలపల్లిలో తోటకూర వజ్రేష్



యాదవ్ పర్యటించారు. ఈ సందర్భంగా తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందన్నారు. అంతేకాకుండా పార్టీ కార్యాలయాన్ని కూడా ఆయన ప్రారంభించారు, ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరుతుండటం బిఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందని చెప్పకనే చెప్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి మండల అధ్యక్షులు బొమ్మలపల్లి నరసింహ మండల వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి తోపాటుగా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# బండి సంజయ్, ఈటలకు హెలికాప్టర్ కేటాయించిన అధిష్టానం



హైదరాబాద్ : తెలంగాణలో ఎన్నికలు సమీపిస్తున్నాయి. పార్టీలన్నీ ప్రచారంలో బిజీబిజీగా గడిపేస్తున్నాయి. ఇక బీజేపీకి ఎన్నికల ప్రచారంలో ఎంపీ బండి సంజయ్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కీలకంగా మారారు. వీరిద్దరి కోసం బీజేపీ అధినాయకత్వం ప్రత్యేకంగా ఓ హెలికాప్టర్‌ను సిద్ధం చేసింది. బండి సంజయ్ రోజుకు మూడు సభల్లో పాల్గొనేలా కార్యాచరణ రూపొందించింది. తమ నియోజకవర్గాల్లో ప్రచారానికి రావాలని బండి సంజయ్‌పై బీజేపీ అభ్యర్థులు ఒత్తిడి చేస్తున్నారు. కరీంనగర్‌లో ప్రచారం చేసుకుంటూనే.. వివిధ నియోజకవర్గాలలోనూ నిర్వహించనున్నారు.

# నిల్వలు లేక.. జిన్నింగ్ కాక

వేములవాడ : గతంలో ఎన్నడూ లేని విధంగా జిన్నింగ్ మిల్లులు ఈసారి నష్టాలను మూట గట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిల్లులకు పూర్తిస్థాయిలో పత్తి రాక అంతంత మాత్రంగానే జిన్నింగ్ సాగింది. జిల్లాలో వేములవాడ, కోనరావుపేట, ఇల్లంతకుంట, బోయినపల్లి మండలాల్లో ఆరు జిన్నింగ్ మిల్లులున్నాయి. ఇందులో ఏ ఒక్క మిల్లుకు పూర్తి స్థాయిలో జిన్నింగ్ చేసేంత పత్తి నిల్వలు రాలేదు. దీంతో పనులు లేక మిల్లులు వెలవెలబోయాయి.జిల్లాలో ఈ సీజన్‌లో 69,200 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేయగా మొత్తం 4.84 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. పత్తి సీజన్ ముగింపు దశకు వచ్చినప్పటికీ జిల్లాలో కేవలం 70,425 క్వింటాళ్ల పత్తిని మాత్రమే జిన్నింగ్ మిల్లులు, ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఇక్కడి రైతుల వద్ద దళారులు పెద్ద ఎత్తున పత్తిని సేకరించి మహారాష్ట్ర, ఆదిలాబాద్, భైంసా ప్రాంతాల్లోని జిన్నింగ్ మిల్లులకు తరలించారు. ఇక్కడి కంటే అక్కడి వ్యాపారులు క్వింటాల్‌కు రూ.200లకు పైగా అదనంగా ధర చెల్లించడంతో చాలా మంది దళారులు తరలించారు. ధర పెరుగుతుందనే ఆశతో చాలా మంది అన్నదాతలు పత్తి నిల్వలను ఇళ్లలోనే చాలా రోజులు నిల్వ చేసుకున్నారు. తీరా ధర పెరగకపోవడంతో దళారులకు విక్రయించారు. గ్రామాల్లో పెద్ద ఎత్తున దళారులు రైతుల ఇళ్ల వద్దనే కాంటాలు పెట్టి



పత్తి కొనుగోలు చేయడంతో స్థానిక మిల్లులకు అంతంత మాత్రంగానే పత్తి వచ్చింది. జిన్నింగ్ మిల్లులకు పూర్తిస్థాయిలో నిల్వలు రాక వెలవెలబోయి మిల్లుల నిర్వహణ యజమానులకు భారమైంది. ఫలితంగా జిన్నింగ్ మిల్లులు నష్టాలను మూట కట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని మిల్లు యజమాని ఒకరు ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇంటి దారి పట్టిన కూలీలు**

జిన్నింగ్ మిల్లుల్లో పూర్తిస్థాయిలో పత్తి జిన్నింగ్‌కు రాకపోవడంతో అందులో పని చేసే కూలీలకు ఉపాధి లేక ఇంటి ముఖం పట్టారు. ఒక్కొక్క మిల్లులో పూర్తి స్థాయిలో జిన్నింగ్ పనులు జరుగుతాయనే అంచనాతో మిల్లుల యజమానులు దాదాపు 60 నుంచి 75 మంది కూలీలను పని కోసం రప్పించుకున్నారు. వీరంతా బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి మధ్యవర్తుల ద్వారా ఒప్పందం చేసుకొని వచ్చారు. తీరా ఇక్కడికి వచ్చిన తరవాత మిల్లులకు పూర్తిస్థాయిలో పత్తి నిల్వలు రాక చాలా మంది కూలీలకు పని లేకుండా పోయింది. దీంతో చేసేది లేక చాలా మంది ఇంటికి తిరుగు పయనమయ్యారు. ఈ ఏడాది పత్తి సీజన్ మొదలైనప్పటి నుంచి మిల్లులకు నిల్వలు అంతంత మాత్రంగానే రావడంతో కూలీలకు సరిపడా ఉపాధి లేకుండా పోయింది. వేములవాడ శివారు నాంపల్లి జిన్నింగ్ మిల్లులో ఏటా సీజన్ పూర్తయ్యే నాటికి దాదాపు 60 వేల నుంచి 80 వేల క్వింటాళ్ల పత్తిని జిన్నింగ్ చేసేవారు. అలాంటిది ఈ సీజన్‌లో కేవలం 20 వేల కింటాళ్లు మాత్రమే చేశారు. దీంతో చాలా మంది కూలీలు పని లేక ఇంటికి వెళ్లిపోయారు. జిల్లాలోని అన్ని జిన్నింగ్ మిల్లుల్లోనూ పెద్ద సంఖ్యలో కూలీలకు ఉపాధి కరవైంది. మరోవైపు మిల్లులకు పూర్తి స్థాయిలో పత్తి రాక నష్టాలే మిగిలాయి. గతంలో ఇలాంటి పరిస్థితి రాలేదుజిన్నింగ్ మిల్లులకు ఇలాంటి గడ్డు పరిస్థితి గతంలో ఎప్పుడూ రాలేదు. ఏటా దాదాపు 60 వేల నుంచి 80 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసి జిన్నింగ్ చేసేది. అలాంటిది ఈ సీజన్‌లో కేవలం 20 వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశాం. జిన్నింగ్‌కు సరిపడా పత్తి నిల్వలు లేక, పని లభించక చాలా మంది కూలీలు తిరిగి వెళ్లిపోయారు. ఈసారి చాలా మిల్లులు నష్టపోయే పరిస్థితి ఏర్పడింది.ఆరోగ్యరెడ్డి, మిల్లు నిర్వాహకుడు, వేములవాడ

# ఇంకుడుగుంతలతో జలసంరక్షణ

జగిత్యాల : గతంలో వర్షాభావ పరిస్థితులతో భూగర్భజలాలు అడుగంటి తీవ్ర కరవు పరిస్థితులను ఎదుర్కొనడంతో ప్రభుత్వం ప్రతి ఇంటా ఇంకుడు గుంత నిర్మాణం చేపట్టుకోవాలని ఆదేశించింది. కొంత కాలంగా సమృద్ధిగా వర్షాలు కురుస్తుండడంతో ఇంకుడు గుంతల నిర్మాణాలపై దృష్టి సారించడం తగ్గించారు. అధికారులు విస్తృతంగా ప్రజల్లో అవగాహన కల్పించి, నిర్దేశించిన లక్ష్యం చేరుకోవడంలేదు. ఫలితంగా ఏటా వృథా నీటిని అడ్డుకోకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి కరవు పరిస్థితులు నెలకొంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఇంకుడు గుంతల నిర్మాణాలపై ప్రజల్లో కొంత అవగాహన పెరిగి దృష్టి సారించినప్పటికీ కొన్నేళ్లుగా ప్రభుత్వం అందించే ప్రోత్సాహక డబ్బులు సకాలంలో చెల్లింపులు కాకపోవడంతో నిర్మాణాలపై లబ్ధిదారులు నిరాసక్తత చూపుతున్నారు. జిల్లాలోని 380 పంచాయతీల పరిధిలో అధికారుల లెక్కల ప్రకారం 1,01,735 ఇళ్లకు గానూ 44,941 పూర్తిచేసినట్లు గుర్తించారు. మిగతా నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించినా పూర్తి చేయలేకపోతున్నారు. జిల్లా వ్యాప్తంగా కమ్యూనిటీ ప్రాంతాల్లో 1781 నిర్మాణాలు చేపట్టాలని గుర్తించగా ఇందులో 802 ప్రాంతాల్లో పూర్తిచేయగా, మిగతా ప్రాంతాల్లో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది.

**నిరుపయోగమే!**

గతంలో నిర్మించుకున్న ఇంకుడుగుంతలు వర్షపు నీటిని మళ్లించే చర్యలు చేపట్టకపోవడంతో నిరుపయోగంగా మారుతున్నాయి. లక్ష్యం కోసం నిర్మించి వదిలేయడంతో వృథాగా నీటికి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, కమ్యూనిటీ ప్రాంతాల్లో మురుగు నీరు మళ్లించడం ద్వారా భూగర్భ జలాలు పెరగడమే కాకుండా పరిశుభ్రంగా ఉండే అవకాశముంది. ఇందుకు నిర్మాణాలే కాకుండా వినియోగంలోకి వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

**అవగాహన కల్పిస్తున్నాం**

**లక్ష్మీనారాయణ, డీఆర్డీవో**

ఇంటింటా ఇంకుడు గుంత నిర్మాణాలు పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించాం. ఇప్పటికే గ్రామాల్లో సెర్ప్, ఈజీఎస్ సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించి నిర్మాణాలు చేపడుతున్నారు. వర్షాకాలంలోపు నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళిక తయారు చేశాం. ప్రస్తుతం నిర్మాణాలు కొనసాగుతున్నాయి.

# నీళ్లిచ్చే కాల్వలు.. నిర్లక్ష్యపు జాడలు

జగిత్యాల : జిల్లా వరదాయని శ్రీరామసాగర్ జలాశయంలో వానాకాలం సీజను ముగిసిన తరుణంలోనూ గరిష్ఠస్థాయి నీటినిల్వ ఉండటంతో యాసంగి ఆయకట్టు పంటల సాగుకు దన్ను కలగనుంది. అధికవర్షాలు కురియటం, ఆయకట్టులో తలపెట్టిన మరమ్మతు పూర్తిగాకపోవటంతో కాలువల చివరి ఆయకట్టు వరకు నీరందటం గగనంగా మారనుంది. ప్రస్తుతం వానాకాలం సీజన్ నుంచి యాసంగి ఆయకట్టుకు నీటివిడుదలకు కాస్త విరామం ఉండే నేపథ్యంలో తక్షణ మరమ్మతు చేపట్టాల్సి ఉంది. ప్రధాన కాకతీయ కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, ఉప కాలువల లైనింగ్ దెబ్బతినటం, కాలువల్లో చెట్లు పెరగటం, షట్టర్లు, కట్టలు శిథిలం కావటం తదితరాలతో నీటి తరలింపు సామర్థ్యం తగ్గింది. 9 వేల క్యూసెక్కుల సామర్థ్యంగల కాకతీయ కాలువలోనే ప్రస్తుతం 6 వేల క్యూసెక్కులకు మించి నీటిని తరలిస్తే గండ్లు పడుతుండటంతో తక్కువనీటినే వదులుతున్నారు. యూటీలు, డ్రాపులు,



సూపర్ ప్యాసేజ్‌లు, అక్విడెక్టులు తదితర నిర్మాణాలు దెబ్బతినటంతో నీటిని తరలించలేని పరిస్థితి తలెత్తింది. కాలువల్లో నిండుగా నీటిని వదలకపోగా పారే కొద్దిపాటి నీటిని మోటార్ల ద్వారా ఎత్తిపోయటంతో 37 వేల ఎకరాల చివరి ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది. కాకతీయ కాలువతో పాటుగా వరదకాలువ నుంచి చెరువుల్లోకి నీటిని తరలించే తూములు, కాలువల నిర్మాణాన్ని పూర్తిచేయాలి. గొలుసుకట్టు చెరువుల్లోకి నీటిని తరలిస్తే భూగర్భ జలమట్టం పెరిగి పంపుసెట్లద్వారానూ నీటిని పారించవచ్చు. వరదకాలువ నుంచి కాకతీయ కాలువలోకి నీటిని తరలించేలా మల్యాల మండలంలో చేపట్టిన అనుసంధాన కాలువ నిర్మాణం పూర్తయినందున నీటి మళ్లింపు చేపట్టాలి. అన్నికాలువలకు లైనింగ్ చేయాలి. దెబ్బతిన్న నిర్మాణాలకు సీజన్ విరామంలో మరమ్మతు ద్వారా చివరిభూముల వరకు నీటిని తరలించేలా చర్యలు చేపట్టాలని కర్షకులు కోరుతున్నారు.

## నారసింహా... శుద్ధజలమేదీ..!

జగిత్యాల : ఏటా రూ.ఆరు కోట్ల ఆదాయం వస్తున్న ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు తాగునీటి ఇబ్బందులు తీరడం లేదు. రద్దీ సమయాల్లో సమస్య తీవ్రంగా ఉంటోంది. బోరునీటినే నేరుగా సరఫరా చేస్తున్నారు. దేవస్థానంలో ఏర్పాటు చేసిన సంపులు, ట్యాంకుల ద్వారా సరఫరా చేసే నీరు అపరిశుభ్రంగా ఉంటోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆలయం ముందు నీటి సంపును ఏర్పాటు చేశారు. ఈ నీటితో దేవస్థానంలోని ట్యాంకును నింపుతూ అక్కడి నుంచి నల్లాల ద్వారా సరఫరా చేస్తున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకే నీరు సరఫరా అవుతోంది. సాయంత్రం నాలుగు గంటల తర్వాత నల్లాల ద్వారా సరఫరా కావడం లేదు. భక్తులు పులిహోర, లడ్డూ ప్రసాదాలు తీసుకున్న తర్వాత చేతులు శుభ్రం చేసేందుకు, తాగేందుకు నీరు లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. భక్తులకు చల్లని శుద్ధజలాన్ని సరఫరా చేయాలనే సంకల్పంతో వివిధ బ్యాంకుల ఆధ్వర్యంలో ఫ్రిడ్జ్‌లను ఏర్పాటుచేయగా అన్నీ మూలన పడ్డాయి. పని చేయని ఫ్రిజ్జులకు సంపు నీటి పైపులను ఏర్పాటు చేసి భక్తులకు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళిక రూపొందించి పైపులను సంపులోకి ఏర్పాటు చేసినా అంతగా ఫలితం కనిపించడం లేదు. ఇప్పటికైనా రక్షితనీరు సరఫరా చేసేవిధంగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపితే మేలు..

కొండగట్టు దేవస్థానంలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ప్లాంట్లను ఏర్పాటు చేసి శుద్ధజలాన్ని భక్తులకు అందిస్తున్నారు. రూ.30 లక్షల వ్యయంతో మూడు నీటిశుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ నీటి ప్లాంట్లను గుట్టమీదే ఏర్పాటు చేయడంతో భక్తులకు ఎంతో సౌకర్యంగా ఉంటోంది. భక్తులు నేరుగా ఈ ప్లాంట్ల వద్దకు వచ్చి శుద్ధజలాన్ని పట్టుకుంటున్నారు. ధర్మపురి దేవస్థానంలో సైతం ఇలా ఏర్పాటు చేస్తే భక్తులకు ఇబ్బందులు తీరే అవకాశం ఉంది.

అపరిశుభ్రంగా ఉంటోంది: విజయ్, భక్తుడు, నిజామాబాద్

ధర్మపురి దేవస్థానానికి ప్రతీ సంవత్సరం వస్తున్నాం. అన్ని సౌకర్యాలు బాగానే ఉన్నా శుద్ధజలం సమస్య మాత్రం ఇక్కడ తీరడం లేదు. భక్తులకు నీడ, నీరు కావాలి. ఇక్కడ మాత్రం శుద్ధజలం లాగానే



రెండు ఫ్రిజ్జులను ఏర్పాటు చేశారు. వాటి నుంచి అపరిశుభ్రమైన వస్తోంది. ఈ నీరే తాగాల్సి వస్తోంది. అధికారులు దృష్టి సారించాలి.

సదుపాయం కల్పించాలి

ధర్మపురి దేవస్థానంలో నీటి సరఫరా విధానం సరిగా లేదు. ఎక్కడెక్కడి నుంచో భక్తులు స్వామివారి దర్శనానికి ఇక్కడికి వస్తుంటారు. రక్షిత నీటిని సరఫరా చేయకుంటే ఎలా. ప్రసాదాలు తీసుకున్న తర్వాత కనీసం చేతులు కడుక్కోవాలంటే నల్లాల నుంచి నీరు రావడం లేదు. ఇంత పెద్ద దేవస్థానంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టాలి.

వంశీ, భక్తుడు, కరీంనగర్

అన్ని రకాల చర్యలు తీసుకుంటాం:

ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో తాగు నీటి సరఫరాకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం దేవస్థానం బయట ఉన్న బోర్‌వెల్ నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. దాతల సహకారంతో శుద్ధ జల యంత్రాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం.

సంకటాల శ్రీనివాస్, ఈఓ, ధర్మపురి దేవస్థానం

# తెల్లబోతున్న పత్తి రైతులు



వరంగల్ : వరంగల్ ఎనుమాముల మార్కెట్‌కు కొత్త పత్తి రావడం మొదలైంది. అయితే పెట్టిన పెట్టుబడికి, వస్తున్న ఆదాయానికి ఏమాత్రం పొంతన ఉండటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి, ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని పంట పండించి, మార్కెట్‌కు తెస్తే వ్యాపారులు, దళారులు కుమ్మక్కై ధర తగ్గించి కొనుగోలు చేస్తూ.. తమను నిలువునా ముంచుతున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 1,22,476 ఎకరాల్లో పత్తి సాగుచేశారు. 7,34,856 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశమున్నట్లు జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎరువులు, కూలీ ధరలు విపరీతంగా పెరగడంతో పెట్టుబడి ఖర్చు తడిసి మోపెడయిందని పలువురు రైతులు పేర్కొన్నారు. అందుకు తగ్గట్టు ధర రాక దిగాలు చెందుతున్నారు. 2021లో ఎనుమాముల మార్కెట్‌లో పత్తి క్వింటాకు రూ.14 వేల వరకు ధర పలికింది. గతేడాది చివరి వరకు కూడా రూ.10 వేలకు మించలేదు. ప్రస్తుతం రూ.7వేలలోపే ధర పలుకుతోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పలువురికి అందడం లేదు. పత్తి కోనుగోలుకు ఈసారి భారత కాటన్ కార్పొరేషన్ (సీసీఐ) సన్నద్ధం అవుతుండటంతో వ్యాపారులు, సీసీఐ మధ్య పోటీ పెరిగి ఎక్కువ ధర అందే అవకాశం ఉందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

కొన్ని బస్తాలకే వేలం..: ప్రతిరోజూ మార్కెట్‌కు వచ్చే మొత్తం పత్తిలో వ్యాపారులు అధికారుల సమక్షంలో నాణ్యమైన పత్తికి మాత్రమే వేలం నిర్వహించి ధర నిర్ణయిస్తున్నారు. కేవలం 10-15 బస్తాలకు మాత్రమే గరిష్ఠ ధర చెల్లిస్తున్నారని, మిగిలిన పత్తి క్వింటాకు రూ.300 నుంచి రూ.600 వరకు తగ్గించి కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. తేమ, రంగు తదితర సాకులు చెబుతూ తక్కువ ధరలకే పంటలను కొనుగోలు చేస్తూ.. తమను ముంచుతున్నారని అంటున్నారు. గతేడాది పత్తి ధరలు అమాంతం పడిపోవడంతో ఏడాది కాలంగా ఇళ్లలో నిల్వచేసి మార్కెట్‌కు తెచ్చిన పత్తికి కూడా ఎక్కువ ధర ఇవ్వడం లేదు. ఏడాదిగా నిల్వ చేయడంతో ఆ పత్తిలో తేమశాతం ఏమాత్రం ఉండదు. వ్యాపారులు కొత్త పత్తితోనే కలిపి కొనుగోలు చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ కరవు..- నునావత్ గోపాల్, బాల్‌నాయక్ తండా (నల్లబెల్లి)

నాకున్న రెండెకరాల్లో పత్తి పంట సాగుచేశా. మొత్తం రూ.50వేల వరకు ఖర్చయ్యింది. మొదటి విడత 15 బస్తాల పత్తి ఇటీవల మార్కెట్‌కు తీసుకువచ్చా. గురువారం క్వింటాకు రూ.6,990 ధరకు పత్తి కొనుగోలు చేసిన వ్యాపారులు, మరుసటి రోజు నా పత్తిని నాణ్యత లేదంటూ రూ.990 తగ్గించి, క్వింటా రూ.6వేలకు మాతరమే కొనుగోలు చేశారు. మార్కెట్‌లో అధికారుల పర్యవేక్షణ కొరవడంతో వ్యాపారులు ఇష్టారీతిన ధర తగ్గించేస్తున్నారు.

కొందరికే ఎక్కువ ధర చెల్లిస్తున్నారు..- మూత శ్రీనివాస్, గీసుకొండ

నాకున్న ఆరెకరాల పొలంలో పత్తి పంట సాగుచేశాను. కూలీలను పెట్టుకోకుండా ఇంటిల్లిపాది కష్టపడి పనిచేసినా మొత్తం రూ.1.20 లక్షలు పెట్టుబడి ఖర్చు అయింది. పత్తి తీసి మార్కెట్‌కు తీసుకొస్తే.. వ్యాపారులు కుమ్మక్కై కేవలం ఒకరిద్దరి రైతులకు మాత్రమే ఎక్కువ ధర చెల్లిస్తున్నారు. మిగిలిన రైతుల పత్తిని క్వింటాకు రూ.500 నుంచి రూ.వెయ్యి వరకు ధర తగించి కొనుగోలు చేస్తున్నారు.

వస్త్ర పరిశ్రమల్లో డిమాండ్ తగ్గింది..- బి.వి.రాహుల్, ఎనుమాముల మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శి

జాతీయంగా వస్త్ర పరిశ్రమలకు పత్తి అవసరం తగ్గింది. దీంతోపాటు అంతర్జాతీయంగా పత్తి గింజలు, బేళ్లకు పెద్దగా ధరలు లేవు. కొన్నిరోజుల పాటు పత్తి ధరల్లో ఎలాంటి పెరుగుదల కనిపించడం లేదు. సీసీఐ ఆధ్వర్యంలో మద్దతు ధరకు పత్తి కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. రైతులు పత్తిలో తేమలేకుండా తీసుకొస్తే.. గిట్టుబాటు ధర పొందే అవకాశముంటుంది.

# గోదావరి పరీవాహకం.. తీర్పులో విభిన్నం



కోరుట్ల: 1952లో ఆవిర్భవించిన మెట్‌పల్లి శాసనసభ నియోజకవర్గంలో 12 సాధారణ ఎన్నికలు, ఒక ఉప ఎన్నిక జరిగింది. 2009లో మెట్‌పల్లి నియోజకవర్గం రద్దయి కోరుట్ల నియోజకవర్గంగా ఆవిర్భవించింది. 2009 నుంచి 2018 వరకు కోరుట్ల శాసనసభకు 3 పర్యాయాలు సాధారణ ఎన్నికలు, ఒక ఉప ఎన్నిక జరిగింది. నియోజకవర్గం భౌగోళికపరంగా గోదావరి పరివాహక ప్రాంతం. ఎస్సారెస్పీ ప్రాజెక్టు ప్రధాన కాలువ నియోజకవర్గంలోని నాలుగు మండలాల మీదుగా వెళ్తోంది. కోరుట్ల నియోజకవర్గంలో కోరుట్ల, మెట్‌పల్లి రెండు రెవెన్యూ డివిజన్లు, పురపాలికలు ఉన్నాయి. కోరుట్ల, మెట్‌పల్లి, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గంలో లక్ష ఎకరాల సాగు భూమి ఉండగా, 51 వేల ఎకరాలకు ఎస్సారెస్పీ ద్వారా సాగు నీరందుతోంది. ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల శివారు నుంచి గోదావరి నది ప్రవహిస్తుంది.

మెట్‌పల్లి నియోజకవర్గం నుంచి 1967(స్వతంత్ర), 1972(కాంగ్రెస్) అభ్యర్థిగా చెన్నమనేని సత్యనారాయణరావు రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేశారు.

1978, 1983(కాంగ్రెస్)లో వర్తినేని వెంకటేశ్వరరావు రెండు పర్యాయాలు గెలుపొందారు.

1985, 1989, 1994(భాజపా)లో చెన్నమనేని విద్యాసాగర్‌రావు వరుసగా మూడు పర్యాయాలు గెలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభలో భాజపా పక్ష నేతగా వ్యవహరించారు.

2009, 2010(ఉపఎన్నిక), 2014, 2018లో కోరుట్ల నియోజకవర్గం నుంచి కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు(తెరాస) వరుసగా నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు.

పరిశ్రమ చుట్టూ రాజకీయాలు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఏకైక వ్యవసాయ ఆధారిత పరిశ్రమ ముత్యంపేట చక్కెర కర్మాగారం 1981-82లో నెలకొల్పారు. దశబ్దకాలం తర్వాత పరిశ్రమ సామర్థ్యాన్ని 1250 మెట్రిక్ టన్నుల నుంచి 2500 మెట్రిక్ టన్నులకు పెంచేందుకు 1992-93లో యంత్రాల మరమ్మతు పనులను బిన్ని కంపెనీకి అప్పగించింది. తర్వాత క్రషింగ్ సామర్థ్యం పడిపోయి నష్టాలను మూటగట్టుకుంది. పరిశ్రమ పరిధిలో మొత్తం 70 వేల హెక్టార్లలో చెరకు పంట సాగు చేస్తుండేవారు. అనంతరం చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం పరిశ్రమను ప్రైవేటు సంస్థకు అప్పగించింది. 2009లో చక్కెర కర్మాగారం మూతపడింది. లేఆఫ్ కారణంగా 2015 డిసెంబరు 22న పరిశ్రమను మూసివేస్తున్నటు పరిశ్రమ ముందు నోటీస్ బోర్డుల్లో పేర్కొనడంతో రైతులు ఉపాధి కోల్పోగా, కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించారు. 2014, 2018లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల్లో తెరాస ప్రభుత్వం అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ముత్యంపేట చక్కెర పరిశ్రమను తెరిపిస్తామని హామీ నెరవేరలేదు. నియోజకవర్గంలో చక్కెర పరిశ్రమ చుట్టే రాజకీయం నెలకొంది. శాసనసభ ఎన్నికల్లో చక్కెర కర్మాగారం రాజకీయంగా కీలక అంశంగా మారనుంది.

చారిత్రక కట్టడాలు.. ఆలయాలు

కోరుట్ల పట్టణంలో 11వ శతాబ్దంలో కట్టిన గడి బురుజులు, పురాతన కోనేరు ఉంది. పురాతన మహాదేవస్వామి దేవాలయం, వేంకటేశ్వరస్వామి దేవాలయం ఉంది. 1375-1400 కాలంలో వేములవాడ దేవాలయం నిర్మించిన చాళుక్య వంశస్తులు కోరుట్ల మండలంలోని సంగెం గ్రామంలో శ్రీసంఘమేశ్వర ఆలయాన్ని రాతితో నిర్మించారు. నాగులపేట శివారులోని ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు 200 మీటర్ల పొడవున అరుదైన సైఫన్ నిర్మించారు.

1929లో మెట్‌పల్లి పాతబస్టాండ్ వద్ద 14 ఎకరాల్లో గాంధీ ప్రధాన శిష్యుడు అన్నసాహేబ్ సహస్రబుద్దే ఖాదీని నిర్మించారు. 1934 వరకు మహారాష్ట్ర బ్రాంచి కింద 1951లో స్వామి రామానంద తీర్థ ఆధ్వర్యంలో కొనసాగింది. 1967లో మెట్‌పల్లి ఖాదీ గ్రామోద్యోగ్ ప్రతిష్ఠాన్‌గా ఏర్పడి 1983 నుంచి ఖాదీ బోర్డు ఆధీనంలో పనిచేస్తుంది. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు, స్వామి రామానందతీర్థ, జువ్వాడి చొక్కారావు, హన్మంత్‌రావు, కల్వకుంట్ల వెంకటరాజేశ్వర్‌రావు ఖాదీబోర్డ్ ఛైర్మన్లుగా పని చేశారు. ప్రస్తుతం కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఖాదీ బోర్డు ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. ఖాదీలో 600 మంది కార్మికులు, 50 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఇక్కడ తయారు చేసిన ఉత్పత్తులను కరీంనగర్, నిజామాబాద్, నిర్మల్, జగిత్యాల, సిరిసిల్ల, హైదరాబాద్, బోధన్, కామారెడ్డిలోని ఖాదీ విక్రయ కేంద్రాలకు సరఫరా చేస్తారు. ఏడాదికి రూ.3 కోట్ల టర్నోవర్‌తో కొనసాగుతుంది. మెట్‌పల్లిలో 2వేల సంవత్సరాల కిందట నిర్మించిన చెన్నకేశ్వరస్వామి దేవాలయం, పురాతన కోనేరు ఉంది.

మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీకనకసోమేశ్వర దేవాలయం సముద్రమట్టానికి 800 అడుగుల ఎత్తులో ఉంది. వాల్గొండ వద్ద పురాతన చరిత్ర త్రికూట ఆలయం రామలింగేశ్వర స్వామి ఆలయం ఉంది. ఇబ్రహీంపట్నం మండలం డబ్బా గ్రామశివారులో మిషన్ భగీరథ వాటర్ గ్రీడ్‌ను 2017-18లో ఏర్పాటు చేశారు. దానిపైన 35 కి.మీ దూరంలోని ఎస్సారెస్పీ ప్రాజెక్టు నుంచి డబ్బాకు ప్రత్యేక పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. పైపులైన్ ద్వారా వచ్చే నీటిని గ్రిడ్‌లో శుద్ధి చేసి అక్కడి నుంచి జిల్లాలోని 18 మండలాలకు, 5 పురపాలికల్లో ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. లి జిల్లా సరిహద్దులోని గండిహనుమాన్ దేవాలయం ప్రత్యేకత చాటుకుటుంది.

# నిబంధనలకు విరుద్ధంగా బయోమెట్రిక్

కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ కార్యాలయ పరిధిలో పని చేసే ఉద్యోగులకు బయోమెట్రిక్ తప్పనిసరి చేశారు. నిబంధనల ప్రకారం ఎనిమిది గంటలపాటు ఉద్యోగులు విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. క్షేత్రస్థాయి ఉద్యోగుల హాజరు విషయంలో మాత్రం గందరగోళం నెలకొంది. ఐఏఎస్ అధికారులు కమిషనర్లుగా పని చేసిన సమయంలోనూ నాలుగు పూటల బయోమెట్రిక్ హాజరు ఉండేది కాదని, కొత్త నిబంధనతో అవస్థలు పడాల్సి వస్తుందని ఉద్యోగులు అంటున్నారు. ఇన్ డోర్, ఔట్ డోర్ ఉద్యోగుల పని వేళలు వేర్వేరుగా ఉంటాయని, దీనిని పరిగణనలోకి తీసుకోలేదని చెబుతున్నారు.

మరికొందరి పాట్లు..

ఇక ఔట్ డోర్ ఉద్యోగుల్లో ఎక్కువ శాతం రెవెన్యూ అధికారులు, బిల్ కలెక్టర్లు, పారిశుద్ధ్య, పట్టణ ప్రణాళిక, వర్క్ ఇన్‌స్పెక్టర్లు తదితర ఉద్యోగులు ఉన్నారు. గతంలో వీరు ఉదయం 8 గంటలకు, సాయంత్రం 6 గంటలకు కచ్చితంగా బయోమెట్రిక్ హాజరు ఇచ్చే వారు. వీరంతా మధ్యాహ్నం 3 గంటలకు విధులకు హాజరయ్యే వారు. గత కొన్ని రోజులుగా నాలుగు పూటలు వచ్చి హాజరు ఇవ్వాల్సిందేనని ఉన్నతాధికారులు తేల్చి చెప్పడంతో తాము ఎక్కడో క్షేత్రస్థాయిలో ఉంటే



అక్కడి నుంచి పరుగులు పెట్టుకొని వస్తున్నామని, హాజరు తర్వాత మళ్లీ అక్కడికే వెళ్లాల్సి రావడంతో సమయం, దూరభారం అధికమవుతుందని వాపోతున్నారు. కొందరు ఉద్యోగులు బయోమెట్రిక్ హాజరు కోసమే వస్తున్నారని, హాజరు తర్వాత పత్తా లేకుండా పోతారని, వారు ఎక్కడ పని చేస్తారో, ఏ విభాగాల్లో ఉంటారో తెలియని వారుండగా ఉన్నతాధికారులు మాత్రం వారిని పట్టించుకోవడంలేదు. హాజరు విషయంలో పరిశీలించి ఇబ్బందులు దూరం చేయాలని నగరపాలక ఉద్యోగులు కోరుతున్నారు.

కార్యాలయ ఉద్యోగులు ఇలా..కార్యాలయ విభాగాల్లో పని చేసే ఉద్యోగులకు ఉదయం 10.30 గంటలకు వచ్చి మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 2.15 గంటలకు భోజన విరామం ఉంటుంది. సాయంత్రం 6 గంటలకు ఇంటికి వెళ్లాల్సి ఉంటుంది. కొందరు కంప్యూటర్ ఆపరేటర్లు, ఉద్యోగులు రాత్రి 8 గంటల వరకు పని చేస్తున్నారు. వీరికి ఓవర్ టైం అనేదీ గుర్తించడం లేదు. కొన్ని సందర్భాల్లో సెలవు రోజుల్లోనూ పని చేస్తున్నారు. అధిక సమయం విధుల్లో ఎందుకు ఉండాలనే అభిప్రాయం పని చేసే వారిలో వ్యక్తమవుతోంది.

# అధ్వాన రోడ్డుతో అవస్థలు

కరీంనగర్ : ఎన్టీపీసీ పీకే రామయ్యకాలనీకి వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. కొన్నాళ్లకే రోడ్డు అస్తవ్యస్థం కావడం.. యాజమాన్యం పట్టించుకోకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానిక ప్రజలు వాపోతున్నారు. ఎన్టీపీసీ పరిధిలోని భరత్‌నగర్ నుంచి పీకే రామయ్యకాలనీ వెళ్లే దారంతా సుమారు రెండు కిలోమీటర్ల దూరం అధ్వానంగా మారింది. రోడ్డు మొదలు నుంచి చివరి వరకు గుంతలు, కొన్ని చోట్ల పూర్తి స్థాయిలో సిమెంట్ తేలిపోయి కంకర బయటికి వచ్చింది. పదేళ్ల క్రితం రోడ్డు వేయగా అనంతరం నిర్వహణ సక్రమంగా చేపట్టకపోవడంతో రోడ్డు ధ్వంసమైంది.

కార్మికులకు తప్పని బాధలు

పీకేరామయ్యకాలనీలో వందలాది మంది నివాసం ఉంటున్నారు. కార్మికులు పరిశ్రమలో పని చేసి తిరిగి వెళ్లేందుకు ఈ దారిగుండా వెళ్లాలి. రోడ్డు సరిగా లేకపోగా నిత్యం ద్విచక్రవాహనం, ఆటోల్లో ప్రయాణం చేసే తమకు వెన్నెముక సమస్యలు వస్తున్నాయని కార్మికులు, వారి కుటుంబ సభ్యులు అంటున్నారు. ఇటువైపు నుంచి పాఠశాలల బస్సులు సైతం నిత్యం వెళ్తుంటాయి. రామగుండం లింగాపూర్ మోడల్ స్కూల్‌కు వెళ్లే దారి కూడా ఇదే. కంకర తేలిన రోడ్డుతో వాహనచోదకులు బెంబేలెత్తున్నారు. గర్భిణులు అంబులెన్స్, ఆటోలో ప్రయాణం చేయాలంటే అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని వెళ్లాల్సి వస్తోంది. ఎన్టీపీసీ పరిధిలో ఉన్న ఆటోడ్రైవర్లు సైతం ఇటువైపు రావడానికి ఆసక్తి చూపకపోవడంతో అత్యవసర సేవలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా



మని స్థానిక ప్రజలు వాపోతున్నారు. కాలనీలో మురుగు కాలువ సమస్య కూడా ఉందని అంటున్నారు. అధికారులు, పాలకులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

యాజమాన్యం స్పందించాలి

పీకే రామయ్యకాలనీకి వెళ్లే దారి సరిగా లేకపోవడంతో ఇటువైపు ఆటోలు సైతం రావడం లేదు. గర్భిణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం వేసిన రోడ్డు కొన్నాళ్లకు ధ్వంసమై గుంతలు ఏర్పడ్డాయి. కుటుంబాల సమస్యలను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యం స్పందించి మరమ్మతులు నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలి.

పద్మ, గృహిణి

అనారోగ్య సమస్యలు రోజూ పనికి ఆటోలో వెళ్తాను. ఒక్కోసారి తోటి కార్మికులతో కలిసి ద్విచక్రవాహనంపై వెళ్తుంటా. రోజూ గుంతల రోడ్డుపై ప్రయాణం చేయడంతో విపరీతంగా నడుము నొప్పి, వెన్నెముక సమస్యలు వస్తున్నాయి. తప్పనిసరిగా జీవనోపాధికోసం పనికి వెళ్లాల్సిందే. గుంతల రోడ్డుతో తీవ్ర అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. తోటి కార్మికులు ఈ రోడ్డుపై ప్రయాణం చేయాలంటే ఇబ్బందిగా వెళుతున్నారు. సంబంధిత సిబ్బంది రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి.

సుదర్శన్‌కరో, ఎన్టీపీసీ కార్మికుడు

# బెల్టు తీస్తామన్నా తగ్గని జోరు

హైదరాబాద్: ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం విక్రయాలను నియంత్రిస్తున్నామని అధికారులు ప్రకటిస్తున్నా.. రాజధానిలో బెల్టు దందా జోరు తగ్గలేదు. బస్తీలు, కాలనీలు, గల్లీల్లో ఎక్కడికక్కడ యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రకటన వెలువడ్డాక అబ్కారీ శాఖ, పోలీసులు నగరవ్యాప్తంగా విస్తృతంగా సోదాలు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నారు. తొలుత గొలుసు దుకాణాలకు అడ్డుకట్ట పడ్డట్లే కనిపించినా.. ఎక్కడికక్కడ మళ్లీ పుట్టుకొస్తున్నాయి. అప్పటివరకూ కొంత బహిరంగంగా కిరాణా దుకాణాల కేంద్రంగా అమ్మకాలు జరిపిన నిర్వాహకులు... దందా నేరుగా ఇళ్లలోకి మార్చారు. దసరా పండుగ సందర్భంగా ఈ అక్రమ దందా వ్యవహారం తేటతెల్లమైంది. ఎన్నికల కమిషన్ దృష్టి ఉంటుందనే ఉద్దేశంతో పండుగ రోజు మద్యం దుకాణాలు, బార్లు నిర్ణీత సమయానికే మూతపడ్డాయి. ఆ తర్వాత బెల్టు దుకాణాలదే జోరు. అర్ధరాత్రి దాటిన తర్వాత నగరంలోని అనేక ప్రాంతాల్లో విక్రయాలు కొనసాగాయి.

సిండికేటు తరహాలో..

శాసనసభ ఎన్నికల్లో గొలుసు కట్టు దుకాణాలు, అక్రమ మద్యంనిల్వలను గుర్తించి స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. గతేడాది అక్టోబరులో దుకాణాలవారీగా అమ్మకాలు, ఈసారి విక్రయాలపై అబ్కారీ శాఖ దృష్టి పెడుతోంది. గతేడాది కంటే అధికంగా నమోదయితే కారణాలు ఆరాతీస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కొందరు మద్యం దుకాణాల యజమానుల సిండికేటు తరహాలో ఏర్పడి



సన్నిహితులతో బెల్టుదుకాణాలు ఏర్పాటుచేయించి సరకు సరఫరా చేస్తున్నారు.

శివార్లలో అధికం

రాజధాని పరిధిలో 615 మద్యం దుకాణాలుండగా, వేలాది బెల్టుషాపులు కొనసాగుతున్నాయి. శివారు ప్రాంతాల్లో బెల్టు దుకాణాల సంఖ్య ఎక్కువగా ఉంది. ఇక్కడ బార్లు, మద్యం దుకాణాలు దూరంగా ఉంటాయి. ఈ క్రమంలో కొందరు మద్యం దుకాణాల యజమానులు కాలనీలమధ్య బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయిస్తున్నారు. ఈ తతంగం అబ్కారీ శాఖ దృష్టిలో ఉన్నా.. చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణ ఉంది.

విక్రయాలకు ఉదాహరణలివిగో..

హయత్‌నగర్ మండలం బంజారాకాలనీ, అంబేడ్కర్‌నగర్, బస్‌డిపో వెనుక ప్రాంతం, కుంట్లూరు రోడ్డులో..


కుత్బుల్లాపూర్ సూరారంకాలనీ, భగత్‌సింగ్‌నగర్, జగద్గిరిగుట్ట, గాజులరామారం

రాజేంద్రనగర్‌లో టీఎన్జీవోకాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్, శంషాబాద్, గండిపేటలోని పలు ప్రాంతాల్లో..జవహర్‌నగర్ అంబేడ్కర్‌నగర్, దమ్మాయిగూడ, కౌకూరు, యాప్రాల్, మల్కారం, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో విక్రయాలు జరుగుతున్నాయి.

# రియల్ శివార్

హైదరాబాద్: నగర పరిధిలో ప్రధాన పార్టీల అభ్యర్థుల జాబితా దాదాపు కొలిక్కి వచ్చింది. అధికార భారాస నాంపల్లి, గోషామహల్ స్థానాలకు.. కాంగ్రెస్ పార్టీ పటాన్‌చెరు, చార్మినార్‌లకు మినహా అన్ని సీట్లకు అభ్యర్థులను ప్రకటించింది. భాజపా సగానికిపైగా స్థానాల్లో టికెట్లను ఖరారు చేయాల్సి ఉంది. ప్రకటించిన అభ్యర్థుల్లో చాలామంది రియల్ ఎస్టేట్ వ్యాపారులే కావడం గమనార్హం. కొన్నేళ్ల క్రితం ఒకరిద్దరే ఉండేవారు. ఇప్పుడు ఎక్కువగా వారే ఉండడం విశేషం.

పట్టణీకరణ, నగరాలకు వలసలు, ఆర్థిక వ్యవస్థ పురోగతి, భూముల ధరలు పెరగడంతో రియల్ ఎస్టేట్ రంగం రెండు దశాబ్దాలుగా అనూహ్యంగా పెరుగుతూ వస్తోంది. ఈ రంగంలో తక్కువ కాలంలో



రూ.వందల కోట్లకు పడగలెత్తిన వారు ఎందరో ఉన్నారు. ఈ తరహా సంపాదన ఉన్నవారు ఇదివరకు ఎక్కువగా సినిమాలు తీయడానికి మొగ్గుచూపేవారు. ఇప్పుడు ఎక్కువ మంది రాజకీయాల వైపు చూస్తున్నారు. దశాబ్ద కాలంగా ఇది బాగా పెరిగింది. స్థానిక ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎంపీలకు పోటీపడే వారిలో స్థిరాస్తి వ్యాపారం చేసేవారే ఎక్కువగా ఉంటున్నారు. అన్ని పార్టీలు వీరికి పెద్దపీట వేస్తున్నాయి ఆయా ప్రాంతాల్లోని ప్రజల్లో కాస్త మంచిపేరు, పలుకుబడి ఉండి ఎన్నికల్లో విజయానికి ఎంతైనా ఖర్చుకు వెనకాడని రియల్ వ్యాపారులను పిలిచి మరీ టిక్కెట్ ఇస్తున్నారు.

శివారు నియోజకవర్గాల్లో..

నగరంతో పోలిస్తే శివారు నియోజకవర్గాలు చాలా పెద్దవి. ఇక్కడ ఆర్థికంగా బలంగా ఉన్న అభ్యర్థి ఉండాలనే ఆలోచనతో ప్రధాన పార్టీలు కూడా చాలాచోట్ల స్థిరాస్తి వ్యాపారం చేస్తున్న వారికే టికెట్లు కేటాయించాయి. కొందరు నేరుగా రియల్ రంగంలో ఉండగా. కుటుంబ సభ్యులు, ఇతరుల భాగస్వామ్యంతో చేస్తున్న వారు ఉన్నారు.

భారాస నుంచి గతంలో గెలిచిన పలువురు ఎమ్మెల్యేల వ్యాపారం రియల్ ఎస్టేటే. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే బిల్డర్ కమ్యూనిటీ నుంచి వచ్చారు. పటాన్‌చెరు ఎమ్మెల్యేది స్థిరాస్తి వ్యాపారమే. పీర్జాదిగూడ మేయర్ నిర్మాణ రంగం నుంచి వచ్చినవారే. వీరి బాటలో ఈసారి మరింత ఎక్కువ మంది ఇతర పార్టీల నుంచి బరిలో ఉన్నారు.కాంగ్రెస్ ప్రకటించిన రెండు జాబితాల్లో ఎనిమిది మంది వరకు స్థిరాస్తి వ్యాపారులే ఉన్నారు. శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, మహేశ్వరం, మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, నాంపల్లి, షాద్‌నగర్‌ల నుంచి పోటీ చేస్తున్న వారు ఈ రంగానికి చెందిన వారేననివారి అనుచరులు చెబుతున్నారు.భాజాపా తొలి జాబితాలో ఐదురుగు స్థిరాస్తి వ్యాపారులు ఉన్నారు. అయితే పూర్తిగా రియల్ వ్యాపారమే కాకుండా రాజకీయ, సామాజిక నేపథ్యం ఉన్న వారికి టికెట్లు దక్కాయి.

# పాల ఉత్పత్తిపై దృష్టిసారిస్తే మేలు




కొత్తగూడెం : గత కొన్నేళ్లుగా పాలు, వాటి అనుబంధ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతూనే ఉంది. కానీ ఉత్పత్తి మాత్రం ఆశాజనకంగా లేదు. ప్రభుత్వం పాల ఉత్పత్తులను ప్రజలకు అందించేందుకు, ఉత్పత్తిదారులను ప్రోత్సహించేందుకు తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ ద్వారా విజయ డెయిరీలను ఏర్పాటు చేసింది. వీటిల్లో ఖమ్మంతో పోల్చితే ఇప్పటికీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లిలోని డెయిరీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి చెందలేదు. కొత్త జిల్లా ఆవిర్భావం తర్వాత కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలకు వలస వచ్చే జనాభా సంఖ్య పెరిగింది. ఉపాధి, పారిశ్రామిక అవసరాల నిమిత్తం వచ్చేవారూ ఎంతోమంది ఉన్నారు. ఈ క్రమంలో గతం కంటే పాలు, అనుబంధ ఉత్పత్తులకు డిమాండ్ పెరిగింది. కావాల్సిందల్లా ఉత్పత్తి పెరిగేలా పాడి రైతులను ప్రోత్సహించడమే.

ఇదీ.. పరిస్థితి

1974లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు ఏపీ పాడిపరిశ్రమ అభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో కొత్తగూడెంలో పాల కేంద్రం ఏర్పాటు చేయించారు. ఆ తర్వాత 2008లో అప్పటి కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు చొరవతో కొంత ఆధునికీకరణ చేపట్టారు. కానీ, డిమాండ్‌కు అనుగుణంగా అభివృద్ధికి చర్యలు చేపట్టడంలో అధికారులు పెద్దగా శ్రద్ధ పెట్టలేదన్న విమర్శలున్నాయి. ఇటీవల లెక్కల ప్రకారం రోజుకు కేవలం 1,500 లీటర్ల పాల సేకరణకు మాత్రమే ఇది పరిమితమైంది. సరైన ప్రోత్సాహం లేకపోవడంతో చాలా మంది ప్రైవేటు డెయిరీలకే పాలు పోస్తున్నారు. దీంతో సేకరించి, శీతలీకరించిన పాలను ఖమ్మంలోని విజయ డెయిరీకి పంపడం తప్ప ఎలాంటి ఎదుగుదల లేకుండా ఈ కేంద్రం మిగిలిపోయింది. కనీసం ప్యాకెట్ల తయారీ యూనిట్‌ను ప్రారంభించాలన్న ప్రణాళికలు సైతం కార్యాచరణ దాల్చలేదు.

60 సెంటర్ల ద్వారా సేకరణ...

కొత్తగూడెం, జూలూరుపాడు, చంద్రుగొండ, సుజాతనగర్, లక్ష్మీదేవిపల్లి, రామవరం, ముల్కలపల్లి, పాల్వంచ, బూర్గంపాడు, ఏడూళ్లబయ్యారం, మణుగూరు ప్రాంతాల్లో మొత్తం 60 పాల విక్రయ కేంద్రాలను డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. స్థానిక రైతుల నుంచి పాలు సేకరించి లక్ష్మీదేవిపల్లిలోని కేంద్రానికి తరలిస్తున్నారు. సీజన్‌లో 4,000, మిగిలిన సమయాల్లో వెయ్యి లీటర్లకు పైగా సేకరణ జరుగుతోంది. కేంద్రంలో 5 వేల లీటర్ల సామర్థ్యంతో శీతలీకరణ యంత్రాలు, నాణ్యత నిర్ధారణ పరికరాలు ఏర్పాటు చేశారు. ఒకవేళ పాల ప్యాకెట్లు తయారు చేయాలంటే సేకరణ ఇంతకు రెట్టింపు పాల సేకరణ జరగాలి. ఆ దిశగా ప్రయత్నాలు సాగితే వినియోగదారులకు శ్రేష్ఠమైన పాలతో పాటు 50 మందికి శాశ్వత ఉపాధి లభించే అవకాశం ఉంది.

పార్లర్లు.. దుకాణ సముదాయాలతో ఆదాయం

జిల్లా కేంద్రంలోనూ డెయిరీకి ఒక్క పార్లర్ లేదు. గతంలో కొత్తగూడెం, అశ్వాపురంతో కలిపి 8 నిర్వహించగా కొన్నాళ్లకే మూతపడ్డాయి. పాల కేంద్రానికి ఉన్న 3.5 ఎకరాల్లో.. హైవే పక్కన పార్లర్, అద్దెకు ఇచ్చేందుకు దుకాణ సముదాయాలు నిర్మిస్తే అదనపు ఆదాయాన్నీ పొందే వీలుంది.

'కేంద్రంలో ప్యాకెట్ల తయారీ జరగాలంటే కనీసం 10 వేల లీటర్ల పాల సేకరణ జరగాలి. ఖాళీ స్థలాల్లో దుకాణ సముదాయాల నిర్మాణంపై డెయిరీ ఛైర్మన్‌కు విన్నవించాం. నిధులు మంజూరైతే నిర్మాణాలు చేపడతాం. కొత్తగా పార్లర్లను ప్రారంభించే యోచన ఉంది. త్వరలో కొత్తగూడెంలో ఒక కేంద్రం అందుబాటులోకి తేనున్నాం. రైతులు డెయిరీకి పాలుపోయాలి.'ఎ.కుమారస్వామి, డెయిరీ ఉపసంచాలకుడు

# అన్నదాతలపై పెనుభారం



ఖమ్మం : రైతన్నలకు చేదు కబురు.. యాసంగి సీజన్ ప్రారంభంలోనే ఎదురు దెబ్బ తగిలింది. ఇప్పటికే కొన్ని రకాల ఎరువుల ధరలు పెంచిన కంపెనీలు ఈ నెల 28 నుంచి పెంచి రైతులను కోలుకోలేని దెబ్బతీశాయి. ఎరువుల ధరలను పెంచుతూ ఆయా కంపెనీలు తీసుకున్న నిర్ణయం అన్నదాతలకు పెనుభారంగా మారింది. ఇక నుంచి రాబోయే కొత్త నిల్వలన్నీ పెరిగిన ధరలకే వర్తిస్తాయని సంబంధిత కంపెనీల ప్రతినిధులు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని డీలర్లకు సమాచారం ఇచ్చాయి. పెరిగిన ధరలు వెంటనే అమల్లోకి వచ్చాయి. ప్రతి బస్తాకు రూ.100 వరకు ఒక్కసారిగా పెరగటం అన్నదాతలకు ఇబ్బంది కలిగించే విషయం. యాసంగి సీజన్‌లో రెండు జిల్లాల రైతులపై రూ.కోట్లాది భారం పడటంతో సేద్యం చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి.

ముడి సరకు ధరలు పెరిగి...

ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్‌బీఎస్(న్యూట్రిషన్ బేస్డ్ సబ్సిడీ) పోషకాధారిత రాయితీ నిధులను ప్రస్తుత యాసంగి సీజన్‌కు సంబంధించి కేటాయించింది. అంతర్జాతీయ విపణిలో ముడి సరకుల ధరలు పెరిగాయి. దీంతో తయారీ ఖర్చులు భారమై ఎరువుల ధరలు పెంచక తప్పడం లేదని పలు కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు.

ఈ మూడు పాత ధరలకే...

మూడు రకాల ఎరువులపై మాత్రం ధరలు పెరగలేదు. 20-20-0-13 రూ.1200, డీఏపీ రూ.1350, 10-26-26 రూ.1470 చొప్పున పాత ధరలకే విక్రయిస్తారు. కొన్ని రకాల ఎరువుల ధరలు పెరిగినప్పటికీ.. రిటైల్ డీలర్ల షాపుల్లో ఉన్న పాత నిల్వలను గత ధరలకే విక్రయించాల్సి ఉంటుంది.

వర్షాభావంతో తీరని నష్టం..

ఈ ఏడాది ఏర్పడిన వర్షాభావ పరిస్థితులు అన్నదాతల వెన్ను విరిశాయి. ప్రధాన సాగునీటి వనరులన్నీ వట్టిపోతున్నాయి. చిన్నా, పెద్ద చెరువులు, కుంటలు నీటి లభ్యత లేక వెలవెలబోతున్నాయి. బోరు బావుల్లో నీరు అడుగంటిపోతోంది. అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల కొన్ని ప్రాంతాల్లో వేసిన పంటలు ఎండిపోతున్నాయి. ఇప్పటికే అన్నదాతలు సాగు కోసం అప్పులు చేశారు. వడ్డీ వ్యాపారులను ఆశ్రయించి రూ.వేలల్లో పెట్టుబడులు పెట్టారు. పంట చేతికి అందుతుందో లేదోనని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ తరుణంలో ఎరువుల ధరలు పెరగడం వారిపై పెనుభారం మోపడమే అవుతుంది.

పాత ధర: 500.00


కొత్త ధర : 600.00

# కార్మిక దళం.. బలమైన గళం

కొత్తగూడెం : సింగరేణి కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం కాదు. ఈ ప్రాంతం ప్రతి సార్వత్రిక ఎన్నికల్లోనూ కీలక భూమిక పోషిస్తుంది. సంస్థ పరిధిలో రెండేళ్లకోసారి గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహిస్తారు. వాటి ఫలితాలను బట్టి ఓటరు నాడి తెలిసేది. ఇటీవల జరగాల్సిన 'గుర్తింపు' పోరు వాయిదా పడిన విషయం తెలిసిందే. దీంతో 'అసెంబ్లీ ఎన్నికల్లో సింగరేణి ప్రాంత కార్మికుల తీర్పు ఎలా ఉండబోతోంది?' అనే ప్రశ్న మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎలాగైనా అత్యధిక స్థానాలు దక్కించుకోవాలని భారాస పట్టుదలతో ఉంటే, అధికారమే లక్ష్యంగా ప్రధాన ప్రత్యర్థి పార్టీలు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నాయి. అనుబంధ సంఘాల నేతలు తమ అభ్యర్థులు, ఆశావహులకు మద్దతుగా ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని సింగరేణి ఏరియాల్లో ఉన్న కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, సత్తుపల్లి (కొత్తగూడెం ఏరియా) నియోజకవర్గాల్లో కార్మికుల ఓటు ఎటువైపో? అన్నది చర్చనీయాంశంగా మారింది.

నాలుగు ఏరియాలు.. లక్షన్నరకు పైగా ఓట్ల ప్రభావం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు ఏరియాల్లో సింగరేణి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారు. వీరిలో రెగ్యులర్ ఉద్యోగుల కుటుంబాలు 6 వేలకు పైగా ఉన్నాయి. సంస్థ కార్యకలాపాలకు గత కొన్నేళ్లుగా ఒప్పంద కార్మికుల సేవలను వినియోగించుకుంటున్న విషయం తెలిసిందే. వీరి సంఖ్య సుమారు 12 వేలు. మరో పది వేల మంది విశ్రాంత ఉద్యోగులున్నారు. సింగరేణి ఆధారంగా రవాణా, లోడింగ్, ఇతర పనులతో ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి పొందుతున్న వారు సుమారు 8 వేల మంది ఉన్నారు. ఆయా కుటుంబాల్లో ఒక్కో ఇంట్లో సగటున నాలుగు చొప్పున ఓట్లు ఉంటాయని పార్టీల అంచనా. అంటే..



నాలుగు నియోజకవర్గాల్లో కలిపి 1.5 లక్షల మంది ఈ ఎన్నికల్లో ఓటేయనున్నారు. పోటాపోటీ నేపథ్యంలో ప్రతీ ఓటూ ముఖ్యం కావడంతో అభ్యర్థులు, కార్మిక సంఘాల వారు సింగరేణీయులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు.

ఎన్నిక ఏదైనా.. తీర్పు విభిన్నం

గత కొన్ని ఎన్నికల్లో కార్మికులు ఇచ్చిన తీర్పు ఎప్పుడూ ఒకేలా లేకపోవడం విశేషం. దీంతో బరిలో నిలిచిన అభ్యర్థులు మల్లగుల్లాలు పడే పరిస్థితి ఎదురయ్యేది. 2017లో సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల్లో కార్మికులు భారాస అనుబంధ తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘాన్ని (తెబొగకాసం) గెలిపించారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భిన్న తీర్పు వెలువడింది. కోల్‌బెల్ట్ ఏరియాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాకలో కాంగ్రెస్.. సత్తుపల్లిలో టీడీపీ అభ్యర్థులు గెలిచారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కార్మికులు అత్యంత ప్రభావితం చేయగల ఉమ్మడి ఖమ్మం, మహబూబాబాద్ స్థానాల్లో మళ్లీ భారాసయే గెలిచింది. పలు ఎన్నికల్లో ఇచ్చిన విభిన్న తీర్పులు తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మరింత ఉత్కంఠ రేపుతున్నాయి. 'గని' కార్మికులు ఎవరి పక్షాన నిలుస్తారో మరికొద్ది రోజుల్లో తేలనుంది.

# అడుగడుగునా నిఘా

వరంగల్ : ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసులు అడుగడుగునా నిఘా పెట్టారు. మొత్తం 24 ప్రాంతాల్లో పోలీసు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 10, ములుగు జిల్లాలో 4, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 3, మహబూబాబాద్ జిల్లాలో 7 చొప్పున పెట్టారు. 24 గంటలు పనిచేస్తున్నాయి. వీటిల్లో మూడు షిఫ్టుల్లో పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. ఎస్సై, ఏఎస్సైతో పాటుగా ఐదుగురు కానిస్టేబుళ్లు ఉంటారు. కేంద్ర బలగాలు సహకరిస్తున్నాయి.

ఎక్కడెక్కడ ఉన్నాయంటే

వరంగల్ పోలీసు కమిషనరేట్: కటాక్షపూర్, చలివాగు వంతెన, హనుమాన్ జంక్షన్, ఎల్కతుర్తి ఠాణా: పెంచికలపేట క్రాస్‌రోడ్డు, మిల్స్‌కాలనీ: ఉర్సుగుట్ట, మామునూరు సమీపంలోని ఆర్టీఏ జంక్షన్, ఖానాపురం ఠాణా: మంగళవారిపేట, జనగామ ఠాణా: పెంబర్తి, రఘునాథపల్లి సమీపంలోని కొమ్మాల, కొడకండ్ల ఠాణా: మొండ్రాయి, జయశంకర్ భూపాలపల్లి జిల్లా: భూపాలపల్లి శివారు, రేగొండ మండలం రూపిరెడ్డిపల్లిలో, మొగుళ్లపల్లి మండలం పెద్దవాగు. ములుగు జిల్లా: మంగపేట మండలం బ్రాహ్మణపల్లి, వెంకటపూర్ మండలం వెళ్తుర్లపల్లి, ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లి, దేవనగర్‌క్రాస్‌రోడ్డు. మహబూబాబాద్ జిల్లా: డోర్నకల్ శివారు, ముల్కలపల్లి, మరిపెడ, దంతాలపల్లి, కేసముద్రం ఠాణా: కొరుకొండ వద్ద, తొర్రూరు క్రాస్‌రోడ్డు, గూడూరు మండలం భూపతిపేట.

ఉమ్మడి జిల్లాలో 24 చెక్‌పోస్టులు

పోలీస్ కమిషనర్, ఎస్పీలు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. తరచూ చెక్‌పోస్టులు తనిఖీ చేస్తూ.. సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. అవసరమైన సూచనలు చేస్తున్నారు.

తనిఖీలు ఇలా చెక్‌పోస్టుల వద్ద వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బారికేడ్లను ఏర్పాటు చేశారు. రోడ్డు వెంట టెంట్ వేసి అందులోనే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. తనిఖీల్లో పెద్ద ఎత్తున నగదు పట్టుబడుతోంది. బంగారం, డ్రగ్స్‌తోపాటు ఎన్నికల్లో పంపిణీ చేయడానికి వస్తువులను గుర్తించి ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తున్నారు. వారు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు. ఆధారాలు చూపిస్తే ఇస్తున్నారు. లేదంటే సీజ్ చేస్తున్నారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో రూ.3.20 కోట్ల విలువ చేసే బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా రూ.4.81 లక్షల విలువ చేస్తే ఇతర సామగ్రిని పట్టుకున్నారు.

# ఆధార్ సేవల చిరునామా ఎక్కడ..!

వరంగల్ : ప్రతి భారతీయునికి ప్రామాణికంగా అందించే విశిష్ట గుర్తింపు కార్డు 'ఆధార్'. ఈ కార్డు చాలా ప్రభుత్వ పథకాలతో పాటు ఇతర అవసరాలకు చాలా ముఖ్యం. ఆధార్ లేనిదే ఆస్తి రిజిస్ట్రేషన్లు, బ్యాంకు లావాదేవీలు, ఈకేవైసీలు జరగవు. అంత ముఖ్యమైన ఆధార్ సేవలు ఏటూరునాగారం సబ్‌డివిజన్ పరిధిలో ఏళ్ల తరబడి అందడం లేదంటే అతిశయోక్తి కాదు. ఆధార్ కార్డు నవీకరణ, ఈకేవైసీ కోసం దూర ప్రాంతాలకు వెళ్లి వ్యయ, ప్రయాసలకు ఓర్చి మరీ వెళ్లాల్సివస్తోంది. ఈ సమస్య ఆధార్ నిర్వహణ సంస్థ (యూఐడీఏ) దృష్టికి వెళ్లినప్పటికీ ప్రతిస్పందన కోసం జిల్లా యంత్రాంగం ఎదురుచూస్తోంది. ఆధార్ కేంద్రాలు లేకపోవడంతో కలుగుతున్న ఇబ్బందులను పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ దిల్లీలోని ఆధార్ సంస్థ దృష్టికి తీసుకెళ్లినా ఆ సంస్థ స్పందించలేదని తెలుస్తోంది.

నాలుగు మండలాల్లో కేంద్రాలు లేవు...

జిల్లాలోని మారుమూల ప్రాంతాలైన కన్నాయిగూడెం, వెంకటాపురం, వాజేడుతోపాటు ఏటూరునాగారంలో ఆధార్ నమోదు కేంద్రాలు ప్రస్తుతం అందుబాటులో లేవు. ఏటూరునాగారంలో ఏడాదిన్నర నుంచి ఈ కేంద్రం తెరవడం లేదు. కన్నాయిగూడెం కొత్త మండలం కావడంతో అక్కడ ఇంకా ఏర్పాటు చేయలేదు. దీంతో కన్నాయిగూడెం ప్రజలు అరవై కి.మీ దూరంలోని మంగపేట వెళ్తున్నారు లేదా జిల్లా కేంద్రానికి వెళ్తున్నారు. ఇక వాజేడు, వెంకటాపురం ప్రజలు మంగపేట లేదా తాడ్వాయి వెళ్లి పనులు చేసుకుంటున్నారు. ప్రతి మండలంలో ఒక శాశ్వత ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ అడుగులు పడడం లేదు. కన్నాయిగూడెం మండలంగా ఏర్పడి దాదాపు ఎనిమిదేళ్లు పూర్తి కావస్తున్నా ఆధార్ కేంద్రం లేకపోవడం దురదృష్టకరం.

కోర్టు కేసుతో నిలిపివేత...

ఆధార్ కేంద్రాలు కొత్తవి ఏర్పాటు లేదా పాతవాటి పునరుద్ధరణకు ప్రతిపాదనలు జిల్లా యంత్రాంగం చేసినప్పటికీ ఆధార్ ప్రాధికార సంస్థకు ఐటీ శాఖకు కోర్టులో కేసు ఉన్నందున నిలిచిపోయాయి. దీంతో జిల్లాలో ఏటూరునాగారంలో రెండు, కన్నాయిగూడెంలో ఒకటి, మల్లంపల్లిలో ఒకటి ఏడాది క్రితమే ప్రతిపాదనలు అప్పటి కలెక్టర్ కృష్ణ ఆదిత్య పంపించారు. కానీ కోర్టు పరిధిలో కేసు ఉండడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడానికి ఉత్తర్వులు రావడం లేదు. దీంతో ఆధార్ సేవలకు ఆటంకం ఏర్పడింది. ఆధార్ కేంద్రాల ఏర్పాటు, పునరుద్ధరణ ప్రస్తుతం కలెక్టర్‌ల స్థాయిని దాటి రాష్ట్ర స్థాయికి చేరుకుంది.

బ్యాంకులు, పోస్టాఫీసులు సేవలు పొందవచ్చు

ఆధార్ సేవలను బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా పొందవచ్చు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో సేవలను అందిస్తున్నాయి. ఇటు బ్యాంకులు అటు పోస్టాఫీసులు చొరవ తీసకుని ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేసి సేవలను అందించే అవకాశం ఉంది. కానీ ఆయా శాఖల ఉన్నతాధికారులు ప్రతిపాదనలు పంపిస్తే యూఐడీఏ పరిశీలించి అనుమతులు ఇవ్వొచ్చు. ఇలా కేంద్రాలను ప్రారంభిస్తే చాలావరకు ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయి.

మూడు సార్లు వెళ్లాక పని అయింది

మదుగూరి.శ్రీను, ఏటూరునాగారం

మా ఇద్దరి పిల్లల ఉన్నత చదువుల కోసం ఆధార్ నవీకరణ చేయాల్సి ఉండగా మంగపేటకు వెళ్లాం. ఈ పనికి మూడు సార్లు తిరగాల్సి వచ్చింది. రెండు వేల వరకు ఖర్చు అయింది. ఇక్కడే ఆధార్ కేంద్రం ఉంటే ఇంత ఖర్చు తప్పేది.

50 కి.మీ వెళ్లా..వెంకటయ్య, కన్నాయిగూడెం

ఆధార్ సేవల కోసం మా ఊరు నుంచి 50 కి.మీ దూరంలోని మంగపేటకు పోవాల్సి వచ్చింది. దీంతో మాకు చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే కేంద్రం ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

కేంద్రాలకు ప్రతిపాదలను పంపించాం దేవేందర్, ఈడీఎమ్, ములుగు.

ప్రతి మండలంలో ఆధార్ సేవలను అందించడానికి కేంద్రాల ఏర్పాటుకు కలెక్టర్ తరపున ప్రతిపాదనలు పంపించాం. కోర్టు కేసు కారణంగా నిలిచిపోయాయి. తీర్పు రాగానే ప్రారంభించే అవకాశం ఉంది. పాతవాటిని పునరుద్ధరించాలన్నా కోర్టు తీర్పు రావాల్సిందే.

# వీధి కుక్క.. పెరుగుతున్న లెక్క!

మహబూబాబాద్ :ఓరుగల్లు నగరంలో వీధి కుక్కలు రెచ్చిపోతున్నాయి. నగరవాసులకు ఐదారు నెలలుగా నిత్యం కుక్క కాట్లు తప్పడం లేదు. ఇటీవల రెడ్డికాలనీలో ఒకటే రెండున్నర గంటల్లో 36 మందిపై దాడికి తెగబడడం పరిస్థితి తీవ్రతను చెబుతోంది. ఈ క్రమంలో పిల్లలు, వృద్ధులు, మహిళలు రోడ్డు మీదకు రావడానికి భయపడుతున్నారు.

ఎక్కువగా సంచరించే ప్రాంతాలు

నగరంలోని రామన్నపేట పెద్దమోరీ, పాపయ్యపేట, ఓఎస్‌నగర్, రఘునాథ్ కాలనీ, పోతననగర్, రంగంపేట, కొత్తవాడ, దేశాయిపేట, ఎల్బీనగర్, కాశీబుగ్గ, లేబర్ కాలనీ, అబ్బనికుంట, గిర్మాజిపేట, మట్టెవాడ, ఖిలావరంగల్ కోట, శంభునిపేట, రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, ఎస్‌ఆర్‌ఆర్‌తోట, శాంతినగర్, పెరుకవాడ, శివనగర్ ప్రాంతాల్లో వీధి కుక్కలు ఎక్కువగా ఉన్నాయి.

తిమ్మాపూర్, మామునూరు, వసంతపూర్, దూపకుంట, బొల్లికుంట, సింగారం, నక్కలపల్లి, రాంగోపాలపూర్, ధర్మారం, గొర్రెకుంట, ఆరెపల్లి, పైడిపల్లి విలీన గ్రామాల్లో కుక్క కాట్లు తప్పడం లేదు.

రంగశాయిపేట, ఉర్సు, కరీమాబాద్, శివనగర్, సీకేఎం ఆసుపత్రి గల్లీ, ఎల్లమ్మబజారు, మండిబజారు, దేశాయిపేట, పాపయ్యపేట ప్రాంతాల్లోని చికెన్ దుకాణాల వద్ద ఎక్కువగా పోగవుతున్నాయి.

మాంసం వ్యర్థాలతోనే..



వీధి కుక్కలు పెరగడానికి చాలా కారణాలున్నాయని నిపుణులు తేల్చారు. విచ్చల విడిగా మాంసం, చికెన్ వ్యర్థాలు, రెస్టారెంట్లు, హోటళ్లలో మిగిలిపోయిన ఆహారాన్ని పడేస్తుండటంతో వాటికి సరిపడా ఆహారం లభిస్తోంది.. కాజీపేట, హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో చికెన్, మటన్ వ్యాపారులు వ్యర్థాలను డ్రైనేజీల్లో పడేస్తున్నారు. అమ్మకాల దుకాణాల ముందు పెద్ద సంఖ్యలో గుంపులు సంచరిస్తున్నాయి. విలీన గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో పడేస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో మిగిలిన ఆహారాన్ని డంపర్, కంపాక్టర్ బిన్లు, రహదారుల్లో డంపు చేస్తున్నారు. ఇలాంటి దగ్గర అవి ఎక్కువగా తిరుగుతున్నాయి.

చికెన్, మటన్ వ్యర్థాలు, ఆహారాన్ని బయట వేయకుండా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

మీకు తెలుసా..వరంగల్ నగరంలోని 66 డివిజన్లలో 19 వేల వీధి కుక్కలున్నాయని ప్రజారోగ్య విభాగం పరిశీలనలో తేలింది. ఇందులో 7 వేల కుక్కలు చర్మ వ్యాధుల బారిన పడినట్లుగా గుర్తించారు.

ఇదీ పరిస్థితి..జంతు సంరక్షణ చట్టం ప్రకారం కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స ద్వారా వీధి కుక్కల సంతానోత్పత్తిని నిలువరించాలని పురపాలక శాఖ ఉత్తర్వులు చెబుతున్నాయి. ఈ క్రమంలో నగరంలో వాటిని పట్టుకునేందుకు మూడు బృందాలు, 12 మంది సిబ్బంది, మూడు వాహనాలున్నాయి. ఐదేళ్లుగా గ్రేటర్ పరిధిలో వాటికి కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు చేస్తున్నారు. చింతగట్టు ఎస్సారెస్పీ క్యాంపులో ఆపరేషన్ థియేటర్, డాగ్స్ వెయిటింగ్ హాల్ ఉంది. ఇప్పటి వరకు 10 వేల కుక్కలకు శస్త్ర చికిత్స చేసినట్లుగా లెక్కలు చెబుతున్నాయి. చింతగట్టు ఆపరేషన్ థియేటర్‌లో ప్రస్తుతం రోజూ సగటున 30 శునకాలకు శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఈ లెక్కన నెలకు 900, ఏడాదికి 10 వేలు వరకు కు.ని చికిత్సలు చేస్తున్నారు. 66 డివిజన్లలో ఇంకా శస్త్రచికిత్స చేయని 9 వేల కుక్కలకు ఈ లెక్కన కు.ని. చికిత్స పూర్తవ్వాలంటే మరో ఐదేళ్ల సమయం పడుతుందని అంచనా. ఈ సమయంలో వీధి కుక్కలు వందల సంఖ్యలో పిల్లలను కంటాయి.. వాటి పరిస్థితి ఏమిటనేది అర్థం కాని విషయం.

నిపుణుల సలహాలు పాటిస్తాం–డాక్టర్ రాజేష్, ముఖ్యఆరోగ్యాధికారి గ్రేటర్ వరంగల్‌వీధి కుక్కల నివారణ చర్యలు వేగవంతం చేశాం. చర్మ వ్యాధులున్న కుక్కలను పట్టుకొని ఐదు దఫాలుగా డోస్‌లు ఇస్తాం. కు.ని. ఆపరేషన్లు పెంచేందుకు ఆలోచన చేస్తున్నాం. చికెన్, మటన్ వ్యర్థాలు, ఆహార పదార్థాలు బయట పడేయకుండా వ్యాపారులకు నోటీసులు జారీ చేస్తాం. నిపుణుల కమిటీ సలహాలు అమలు చేస్తాం.ఫిర్యాదు చేయొచ్చు.. బల్దియా టోల్ ఫ్రీ నంబరు 1800 425 1980చింతగట్టు డాగ్ హౌజ్ ఇన్‌ఛార్జి భాషానాయక్ సెల్ నంబరు 7893863204బల్దియా పశువైద్యాధికారి డాక్టర్ గోపాల్‌రావు, 9701999701ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజేష్, 9701999689

# ఆదాయమంతా జీతభత్యాలకే!

మల్యాల : జిల్లాలో ధాన్యం దిగుబడులు విపరీతంగా పెరగడంతో ఏటా ఐకేపీ, సింగిల్విండోల ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా సమకూరే కమీషన్ ఆదాయం కార్యాలయాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలకే ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో 51 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలుండగా వాటిలో కొన్ని సింగిల్విండోలు మాత్రమే ధాన్యం కొనుగోలు ద్వారా లాభాల బాటలో పయనిస్తుండగా మిగిలినవాటి ఆదాయమంతా జీతభత్యాలకే ఖర్చవుతున్నాయి. మల్యాల మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా దాని పరిధిలోని ఐదు గ్రామాల్లో ఏటా దాదాపు లక్ష క్వింటాళ్లకుపైగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలుకు రూ.32 చొప్పున దాదాపు రూ.35 లక్షల ఆదాయం సమకూరుతోంది. అయినప్పటికీ ప్రతి సంవత్సరం కార్యాలయంలో పనిచేసే సీఈవో, కంప్యూటర్ ఆపరేటర్, క్లర్కు, సేల్స్ మేనేజరు వేతనాలకు రూ.10 లక్షలు, ఏటా రెండు సీజన్లలో ఏర్పాటు చేసే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది, నిర్వహణ ఖర్చుల కింద రూ.12.50 లక్షల ఖర్చు చేస్తున్నారు.సింగిల్విండో ద్వారా రైతులకు ఎరువులు, వరి విత్తనాలు విక్రయిస్తున్నా పెద్దగా లాభాలు పొందడంలేదు. మల్యాల సింగిల్విండో పరిధిలో కొండగట్టు, మల్యాల అడ్డరోడ్డు, బల్వంతాపూర్, సర్వాపూర్, మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నారు. 2010 నుంచి ప్రభుత్వం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోళు ప్రారంభించింది. ఐదేళ్ల నుంచి ధాన్యం దిగుమతి విపరీతంగా పెరగడంతో ఒక్కో సింగిల్విండోకు రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. సిబ్బంది వేతనాలకే 90 శాతం నిధులు వెచ్చిస్తుండగా మిగిలిన డబ్బులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు పాలకవర్గాలు పేర్కొంటున్నాయి. మల్యాలలోని సింగిల్విండో ఖాతాలో ప్రస్తుతం రూ.22 లక్షలు మాత్రమే ఉన్నాయని, వాటితో నూతనంగా రూ.40 లక్షల అంచనా వ్యయంతో లాకర్ గది సౌకర్యంతో కార్యాలయ భవన నిర్మాణం చేపట్టినట్లు సీఈవో గోవర్ధన్ తెలిపారు. ఏటా తమ సింగిల్విండోలో రూ.10 కోట్ల టర్నోవర్ ఉంటుందని వివరించారు.

# రోడ్ల నిర్మాణం.. వైవిధ్యభరితం



ఖమ్మం : ఆదివాసీల అవస్థల ప్రయాణానికి తెరపడనుంది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల మంజూరుచేసిన నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధి నిధులతో అధునాతన పద్ధతుల్లో బీటీ రహదారులు ఏర్పాటుకానున్నాయి. భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో వీటికి అనుమతులు లభించాయి. గుత్తేదారులు వారంలో పనులు ప్రారంభించేలా ఆర్అండ్‌బీ అధికారులు ప్రణాళికలు రూపొందించారు.

జిల్లాలో బీటీ రోడ్లు మంజూరైన ప్రాంతాలు పినపాక మండలం భూపతిరావుపేట నుంచి వలస ఆదివాసీ గ్రామం సుందరయ్యనగర్‌కు రూ.2 కోట్లతో రెండు కి.మీ. రహదారి నిర్మించనున్నారు.

చర్ల మండలం రామానుజపురం నుంచి గోదావరి నది వరకు 2 కి.మీ. రహదారి నిర్మాణానికి రూ.2కోట్లు, సుందరయ్యనగర్ నుంచి వీరాపురం కాలనీ వరకు 2.5 కి.మీ. రోడ్డు నిర్మాణానికి రూ.2.50 కోట్లు మంజూరయ్యాయి. ఆళ్లపల్లి మండలంలో ప్రధాన రహదారి నుంచి రాఘవపురం వరకు, దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం నుంచి లక్ష్మీపురం వరకు రూ.20 కోట్లతో సుమారు 20 కి.మీ. రోడ్డును ఏర్పాటు చేయనున్నారు.

అధునాతన పద్ధతుల్లో.. పినపాక మండలం భూపతిరావుపేట నుంచి సుందరయ్యనగర్ వరకు రహదారి నిర్మాణానికి ప్రత్యేక పద్ధతులు అవలంబిస్తున్నారు. ముందుగా రహదారిపై 70 శాతం గ్రావెల్, 30 శాతం జీఎస్పీ మిశ్రమాన్ని పరుస్తారు. మొదటి దశలో భాగంగా ఒక క్యూబిక్ మీటరు మిశ్రమానికి 40 కిలోల సిమెంట్‌ను కలుపుతారు. ఈ మిశ్రమం అంతా కలిసేలా రోటావేటర్‌తో చదును చేస్తారు. రెండోదశలో ఒక క్యూబిక్ మీటరు గ్రావెల్, జీఎస్పీ మిశ్రమానికి 60 కిలోల సిమెంటు కలిపి చదును చేస్తారు. మూడో దశలో బీటీ పోయటంతో రహదారి నిర్మాణం పూర్తవుతుంది.

దుమ్ముగూడెం మండలంలో సుమారు 20 కి.మీ. రహదారి నిర్మాణంలో ప్లాస్టిక్ వ్యర్థాల మిశ్రమాన్ని వినియోగించనున్నారు. రహదారి మన్నిక ఏళ్ల తరబడి చెక్కు చెదరకుండా ఉండేలా చర్యలు చేపడుతున్నారు. ఆళ్లపల్లి, చర్ల మండలాల్లో ప్రత్యేక రసాయనం (టెర్రాజైం)తో బీటీ రోడ్లు నిర్మించనున్నారు. ఈ రహదారుల మన్నిక చాలాకాలం ఉంటుంది.

ప్రత్యేక ప్రమాణాలు పాటిస్తూ బీటీ రహదారులు నిర్మించటం జిల్లాలో ఇదే మొదటిసారి. గతంలో ఏర్పాటు చేసిన వాటికి భిన్నంగా ఈరోడ్లు ఉంటాయి.రాంబాబు,ఏఈ, ఆర్అండ్‌బీ

# ఏమరుపాటు.. ప్రాణాలకు చేటు



ఖమ్మం :విద్యుత్తు తీగ మృత్యుపాశమవుతోంది. క్షణకాల నిర్లక్ష్యంతో ఎంతోమంది ప్రాణాలు బలిగొంటోంది. మరెందరో వైకల్యం బారిన పడుతున్నారు. తెగి పడిన తీగలు, పంటలను కాపాడేందుకు పెట్టే రక్షణ కంచెలు, వ్యవసాయ విద్యుత్తు మోటార్లు, నియంత్రికల ఎర్తులు వంటివి ఉసురు తీస్తున్నాయి. అకాల వర్షాల కారణంగా జిల్లాలో ఇటీవల పలు సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. విద్యుత్తు ప్రమాదాలపై సిబ్బందిని, ప్రజలను చైతన్య పరిచేందుకు విద్యుత్తు శాఖ ఏటా మే ఒకటి నుంచి వారం రోజులపాటు భద్రత వారోత్సవాలు నిర్వహిస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 11 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో సుమారు 1.6 లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. జోరుగా గాలి వీచినప్పుడు, వర్షాకాలంలో తీగలు తెగడం, పంటకు రక్షణగా కంచెకు విద్యుత్తు పెట్టడం, జంతువులను, చేపలను వేటాడేందుకు ఏర్పాటు చేసిన తీగలు తగలినప్పుడు ప్రమాదాలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. ఉప కేంద్రాల్లో అరకొరగా సిబ్బంది ఉండటంతో వేలాడే, తెగిన విద్యుత్తు తీగలను గుర్తించడం ఆలస్యమవుతోంది.పరిహారం పొందొచ్చు...విద్యుత్తు ప్రమాదాలతో మృతి చెందిన కుటుంబాలకు సంస్థ పరిహారం అందిస్తుంది. అయితే ఘటన ఆ శాఖ నిర్లక్ష్యం వల్ల జరిగిందని తేలితేనే పరిహారం మంజూరవుతుంది. వ్యక్తి మృతి చెందితే రూ.5 లక్షలు, పశువులకు రూ.40 వేలు, గొర్రెలు, మేకలకు కూడా పరిహారం అందిస్తున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు స్టేషన్‌లో, విద్యుత్తు శాఖ అధికారులకు తెలియజేయాలి. ఎఫ్ఐఆర్, పంచనామా ధ్రువీకరణ పత్రాలను జతపరిచి దరఖాస్తు చేసుకోవాలి.

జాగ్రత్తలు... విద్యుత్తు సరఫరా చేసే పరికరాలను అమర్చుకోవడంలో నిర్లక్ష్యం వహించకూడదు. ప్లాస్టిక్ స్టార్టర్ బాక్సులు ఏర్పాటు చేసుకోవాలి. ఎర్తింగ్ తప్పనిసరి.

వర్షాలు పడినప్పుడు తెగిపడిన విద్యుత్తు తీగలు, విరిగిన స్తంభాలను ముట్టుకోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటిని గుర్తించిన వెంటనే అధికారులకు సమాచారం అందించాలి.

వేలాడుతున్న తీగల గురించి అధికారులకు తెలియజేయాలి.

అనుమతి లేకుండా నియంత్రికల పైకి ఎక్కి తీగలు సరి చేయడం, మరమ్మతు చేయడం, సర్వీసు వైర్లు మార్చకూడదు.

వ్యవసాయ పంపుసెట్ల వద్ద సర్వీసు, ఎర్త్ వైర్లు మంచి నాణ్యమైన ఇన్సులేషన్ ఉన్నవి వినియోగించాలి. పొలం కంచెకు స్టే వైర్లు, ఎర్త్ వైర్లు తగలకుండా చూసుకోవాలి.

ఫ్యూజులు, స్టార్టర్ బోర్డులు నేలకు 5 అడుగుల ఎత్తులో ఉండేలా ఏర్పాటు చేయాలి.

ఫ్యూజు కాలిపోతే నేరుగా కనెక్షను ఇవ్వకూడదు. దీనివల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కొత్త ఫ్యూజు అమర్చుకోవాలి.

దుస్తులు ఆరేసేందుకు ఉపయోగించే దండెంగా తాడును, ఇన్సులేషన్ ఉన్న తీగను ఉపయోగించాలి. విద్యుత్తు తీగలకు దగ్గరగా కట్టకూడదు.

ఎవరికైనా విద్యుదాఘాతం తగిలితే రక్షించాలనే ఆతృతతో ముట్టుకోవద్దు. విద్యుత్తు సరఫరాను నిలిపివేయాలి.

పంట పొలాల రక్షణ కంచెలకు విద్యుత్తు కనెక్షను ఇవ్వవద్దు. సోలార్ ఫెన్సింగ్ ఉపయోగించుకోవచ్చు.

ఏడాది కాలంలో జరిగిన ప్రమాదాలు

ఖమ్మంలో.... 30 మంది వ్యక్తులు, 153 పశువులు

భద్రాద్రి కొత్తగూడెంలో...32 మంది వ్యక్తులు, 102 పశువులు మృత్యువాత పడ్డాయి. మరెందరో గాయాలపాలయ్యారు.

మధిరలో వేర్వేరు ఘటనల్లో విద్యుదాఘాతంతో కొణతం రామచంద్రరావు(59), కంభం అనిల్(21) మృతి చెందారు.

అప్రమత్తంగా ఉంటే ప్రమాదాల నివారణ

నిర్లక్ష్యం, అవగాహన లేమితోనే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ప్రజలను, రైతులను చైతన్య పరిచేందుకు ఏటా మే మొదటి వారంలో భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నాం. ప్రజలు జాగ్రత్తలు పాటిస్తే అనేక ప్రమాదాలను నివారించి, ప్రాణాలను కాపాడుకోవచ్చు. ఏదైనా ఘటనను గుర్తిస్తే వెంటనే సమాచారం అందించాలి.

ఎ.సురేందర్, ఎస్‌ఈ, ఖమ్మం

సమాచారం ఇద్దాం... తెగిన, వేలాడే విద్యుత్తు తీగలు, ప్రమాదాలు గుర్తించిన వెంటనే టోల్ ఫ్రీ నెంబరు: 1800 425 0028, హెల్ప్‌లైన్ 1912కు సమాచారం అందించాలి.

# ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి

ఖమ్మం : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో దశాబ్దాల నుంచి పనిచేస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణ, హెచ్‌ఆర్ పాలసీ అమలు ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. ఈ మేరకు ఖమ్మం డీసీసీబీలో నిర్వహించిన డీఎల్‌ఈసీ(డిస్ట్రిక్ట్ లెవల్ ఎంపవర్‌మెంట్ కమిటీ)లో ఆమోదముద్ర పడింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా తీర్మానించారు. ఈడీసీసీబీ పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లోని 100 పీఏసీఎస్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు జీవో–44 ప్రకారం అర్హత ఉన్న వారిని గుర్తించి ఉత్తర్వులు వెలువరించారు.

ఏప్రిల్ నెల నుంచే కొత్త వేతనాలురెగ్యులర్ అయిన వారికి వేతనాలను సవరించారు. ప్రతి ఉద్యోగికి నిర్దేశించిన ప్రకారం పే స్కేల్ వర్తింపజేశారు. ఏప్రిల్ 1 నుంచే కొత్త వేతనాలు చెల్లిస్తారు. ఇందుకోసం ప్రతి సహకార సంఘంలో 'మార్జిన్ మనీ' ఖాతాలు తెరవనున్నారు. ఇక నుంచి ఈ ఖాతాల్లో జమచేసిన నిధుల ద్వారానే ఉద్యోగులకు వేతనాలు చెల్లిస్తారు. గతంలో ప్రతి బ్రాంచి మేనేజర్ మూడు నెలలకోసారి సంఘాలను తనిఖీ చేసేవారు. ఇక నుంచి ప్రతి నెలా పరిశీలించాల్సి ఉంటుంది. గతంలో సహకార సంఘాల్లో పనిచేసి సస్పెన్షన్‌కు గురైనవారు, దీర్ఘకాలిక సెలవుపై వెళ్లినవారు, మధ్యలో ఉద్యోగాలు మానేసి తిరిగొచ్చి చేరిన వారి గురించి డీఎల్‌ఈసీ సమావేశంలో చర్చించారు. ఖమ్మం జిల్లాలో 20 మంది, భద్రాద్రి జిల్లాలో ఇద్దరు ఉన్నారు. వీరికి సంబంధించి 'స్టేటస్‌కో' అమలుచేయాలని నిర్ణయించారు.

కారుణ్య నియామకాలకు పచ్చజెండా..

కారుణ్య నియామకాలకు సంబంధించిన వారు ఖమ్మం జిల్లాలో ఐదుగురు, భద్రాద్రి జిల్లాలో ముగ్గురు ఉన్నారు. నిబంధనల ప్రకారం



వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరించే విషయమై సమావేశంతో సానుకూలంగా తీర్మానించారు. రికవరీ ఉన్న వారి జాబితాను పెండింగులో ఉంచారు. గతంలో క్రమశిక్షణ చర్యలకు గురై రివర్షన్ అయిన ఉద్యోగులకు.. ప్రస్తుతం వారు పనిచేస్తున్న క్యాడర్‌లోనే పే ఫిక్సేషన్ చేశారు.

డీఎల్‌ఈసీ, డీసీసీబీ ఛైర్మన్ కూరాకుల నాగభూషయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఖమ్మం డీసీవో ఎ.విజయకుమారి, డీసీసీబీ సీఈవో, డీఎల్‌ఈసీ సభ్యుడు అట్లూరి వీరబాబు, నాబార్డు డీడీఎం సుజిత్‌కుమార్, ప్యాక్స్ హెచ్‌ఆర్‌డీ సలహాదారు నర్సింహారెడ్డి, టెస్కాబ్ ఏజీఎం వివేక్, డీఎల్‌ఈసీ విభాగం ఇన్‌ఛార్జి, డీసీసీబీ జీఎం పద్మావతి, భద్రాద్రి కొత్తగూడెం డీసీవో వెంకటేశ్వర్లు హాజరయ్యారు.

# తడిసిన ధాన్యం.. ఉప్పుతో ఉపకారం!

ములుగు : ఉమ్మడి జిల్లాలో వరి కోతలు ముమ్మరమై.. కొనుగోలు కేంద్రాలు ధాన్యంతో పోటెత్తుతున్న సమయంలోనే అకాల వర్షాలు అడ్డుపడ్డాయి. కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిసి ముద్దవ్వడం.. పొలాల్లోని వరి నేలవాలడంతో కర్షకులు కన్నీరుమున్నీరవుతున్నారు. ధాన్యం మొలకెత్తకుండా పలు విధాలా ప్రయత్నిస్తున్నారు. తడిసిన వడ్లు రంగు మారకుండా, మొలకలు రాకుండా 'ఉప్పు' ఉపకారిగా పనిచేస్తుందని వ్యవసాయశాఖ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వారి సూచనలను పాటిస్తూ.. ధైర్యంగా ఉందాం..ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా యాసంగిలో సాగైన వరి: 6,48,090 ఎకరాలు వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 70 శాతం, మహబూబా బాద్ 45, భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో 50 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. జనగామ జిల్లాలో వడగళ్లతో చాలా చోట్ల పంట చేతికిరాకుండా నేలరాలింది. ఇక్కడ 30 శాతం కోతలే పూర్తయ్యాయి.

ఊహించని నష్టం...వరంగల్ వ్యవసాయం, న్యూస్‌టుడే: ఉమ్మడి వరంగల్ జిల్లాలో మార్చి నుంచి ఇప్పటి వరకు కురిసిన వర్షాలతో 1.20 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కురిసిన వాన వల్ల 15 లక్షల క్వింటాళ్ల ధాన్యం కల్లాల్లో తడిసి నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. నీళ్లలో కొట్టుకుపోయింది ఎక్కువగానే ఉంది. వాటికి లెక్కలు లేవు. ఆరు జిల్లాల్లో లక్ష ఎకరాలకు పైగా పొలాల్లో ధాన్యం నేలరాలింది.

ఈ జాగ్రత్తలు తీసుకుందాం.. కుప్పలుగా పోసిన ధాన్యాన్ని పలుచగా నేలపై చల్లినట్లు ఆరబోయాలి. ఎప్పటికప్పుడు కలియదిప్పడంతో పాటు గాలి అందేలా చూడాలి. తడిసినవి, రంగుమారిన గింజలను మంచి ధాన్యంతో కలపకూడదు. వేర్వేరుగా ఉంచితే ఎక్కువ నష్టం జరగదు. తడవకుండా ఉండేందుకు కుప్పను ప్రత్యేకమైన పద్ధతిలో కాపాడేలా టార్పాలిన్లు కప్పాలి. వరద పక్కనుంచి వెళ్లేలా పాదులు తీయాలి.

మార్చిలో కోతకు వచ్చేలా..యాసంగి వరి సాగు చేసేవారు మార్చిలో కోతకు వచ్చేలా నాట్లు వేసుకోవాలని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. జనవరి 26 వరకు నాట్లు వేస్తే సరిపోతుంది. చాలా మంది ఫిబ్రవరి మొదటి వారంలో నాట్లు వేయడం వల్ల కోతలు అనుకున్న సమయానికి రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అకాల వర్షాలు తోడుకావడంతో అన్నదాతలు నష్టపోయారు.వర్షపాతం ఇలా.... గతేడాది (2022) జూన్ 1 నుంచి ఈ ఏడాది మే 2వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 1,002.5 మి.మీల సగటు వర్షపాతం నమోదు కావాలి. 1,585.83 మిల్లీమీటర్లు కురిసింది.

# మావోయిస్టుల కదలికలపై నిఘా

ములుగు : మావోయిస్టు కదలికలపై డేగకన్ను వేయాలని రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఐజీ ప్రభాకర్‌రావు ఆదేశించినట్లు తెలిసింది. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతమైన వెంకటాపురం పోలీస్ సర్కిల్ కేంద్రంలో ఆయన రహస్యంగా పర్యటించారు. ములుగు, భద్రాద్రికొత్తగూడెం జిల్లాల పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి నక్సల్స్ కదలికలపై ఆరా తీసినట్లు సమాచారం. ఇటీవల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం అనంతరం ఇక్కడ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది. కీలకమైన ఈ ప్రాంతంలో పోలీసులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

రెండు జిల్లాల అధికారులతో సమీక్ష

భౌగోళికంగా మావోయిస్టుల కదలికలు, రాకపోకలకు అనుకూలంగా ఉన్న ములుగు జిల్లా వెంకటాపురం పోలీస్ సర్కిల్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల పోలీస్ సర్కిల్ పరిధిలోని దండకారణ్యంపై నిశిత శోధన చేపట్టాలని ఉన్నత స్థాయి అధికారులు సూచించినట్లు తెలిసింది. ములుగు ఎస్పీ గౌష్ ఆలం, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ వినీత్, భద్రాచలం ఏఎస్పీ పరితోశ్ పంకజ్‌లతో పాటు సీఆర్పీఎఫ్, ఇంటెలిజెన్స్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులతో ఇక్కడ రహస్య సమావేశం అయ్యారు. తనిఖీలు నిర్వహించి తిరుగుముఖం పట్టిన జవాన్లను మావోయిస్టులు మట్టుబెట్టిన



తీరు, దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత క్రమంలో తీసుకోవాల్సిన రక్షణ, భద్రత చర్యలపై కీలకాంశాలను చర్చించినట్లు తెలుస్తోంది. కట్టుదిట్టమైన భద్రతతో శత్రువును తుదముట్టించేందుకు ప్రణాళికలు చేయాలని ఆదేశించినట్లు సమాచారం.

దండకారణ్యంలోకి అడుగు పెట్టకుండా..

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా, దంతెవాడ, బీజాపూర్ జిల్లాల పరిధిలోని అటవీ ప్రాంతాన్ని అక్కడి సీఆర్పీఎఫ్, డీఆర్జీ, ఏఎస్టీఎఫ్, కోబ్రా, బస్తర్ ఫైటర్స్ బృందాలు జల్లెడ పడుతున్న క్రమంలో మావోయిస్టులు తెలంగాణ అరణ్యంలోకి ప్రవేశించే అవకాశాలు ఉన్నట్లు ఉన్నత స్థాయి సమీక్షలో పోలీసు అధికారులు ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. అక్కడ కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరంగా కొనసాగుతున్న నేపథ్యంలో దండకారణ్యంలోకి మావోయిస్టులు అడుగులు పెట్టకుండా కట్టుదిట్టమైన నిఘాను పెంచాలని సూచించినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మావోయిస్టులు ఏ ప్రాంతానికి వచ్చినా ఎదుర్కొనేలా సంసిద్ధం కావాలని సూచించినట్లు తెలిసింది.


అంతా గోప్యంగానే..

శాంతిభద్రతల పరిరక్షణకు గాను చేపట్టిన ఉన్నత స్థాయి సమీక్షను పోలీసులు అత్యంత గోప్యంగా ఉంచారు. ఎవరు పర్యటించారు? సమీక్షకు సంబంధించిన విషయాలను వెల్లడించేందుకు పోలీసులు నిరాకరించారు. డ్రోన్ ఆపరేషన్ ప్రాంతానికి వెళ్లేందుకు మీడియా ప్రయత్నించినా పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం, పర్యటనకు సంబంధించి కనీస ప్రకటన సైతం జారీ చేయకపోవడం గమనార్హం.

డ్రోన్‌తో అన్వేషణఉన్నతస్థాయి సమీక్ష నేపథ్యంలో పోలీసులు అడుగడుగునా నిఘా పెంచారు. వెంకటాపురం–వాజేడు మార్గంలో ముమ్మరంగా తనిఖీలు చేశారు. సీఆర్పీఎఫ్, ప్రత్యేక పోలీసు బలగాలతో గస్తీ తిరిగారు. పట్టణ శివారులోని ఓ మైదాన ప్రాంతంలో డ్రోన్ ఆపరేషన్ చేపట్టారు. సాంకేతికత సాయంతో సరిహద్దు దండకారణ్యంలో సర్వే చేశారు. మావోయిస్టుల కదలికలు ఉండే గుట్టల ప్రాంతాన్ని డ్రోన్ ద్వారా పరిశీలించారు. ఆయా చిత్రాలను సైతం సమీక్ష సమావేశంలో ప్రదర్శించి చర్చించినట్లు తెలుస్తోంది.

# చంద్రబాబు సన్నిహితుల స్థిరాస్తుల అటాచ్‌మెంట్‌కు సీఐడీ నిర్ణయం

అమరావతి: ఫైబర్ గ్రిడ్ కేసులో సీఐడీ అధికారులు దూకుడు పెంచారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సన్నిహితుల స్థిరాస్తుల అటాచ్‌మెంట్ చేయడానికి నిర్ణయించారు. ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలని సీఐడీ అధికారుల ప్రతిపాదనకు హోంశాఖ ఆమోదం తెలిపింది. దీంతో ఏసీబీ కోర్టు అనుమతి కోసం గురువారం అధికారులు పిటిషన్ దాఖలు చేయనున్నారు. టెరాసాఫ్ట్ కంపెనీతోపాటు చంద్రబాబు సన్నిహితులకు చెందిన ఏడు స్థిరాస్తులను అటాచ్ చేయాలన్న సీఐడీ ప్రతిపాదనకు రాష్ట్ర హోంశాఖ ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అటాచ్ ఆస్తుల్లో గుంటూరులో ఇంటి స్థలం, విశాఖపట్నంలో ఓ ఫ్లాట్, హైదరాబాద్‌లోని నాలుగు ఫ్లాట్లు, తెలంగాణలోని రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయ భూమి తదితర ఆస్తుల అటాచ్‌మెంట్‌కు హోంశాఖ ఉత్తర్వుల నేపథ్యంలో ఆ స్థిరాస్తులను అటాచ్‌మెంట్‌కు అనుమతించాలని కోరుతూ సీఐడీ అధికారులు ఇవాళ విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో పిటిషన్‌ను దాఖలు చేయనున్నారు. ఈ కేసులో నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు పేరిట గుంటూరులో 797 చదరపు అడుగుల విస్తీర్ణం గల ఇంటి స్థలం ఉంది. నిందితుడు కనుమూరి కోటేశ్వరరావు డైరెక్టర్‌గా ఉన్న నెప్‌టాప్స్ ఫైబర్ సొల్యూషన్స్‌కు చెందిన విశాఖపట్నం కిర్లంపూడి లేఅవుట్‌లోని ఓ ఫ్లాట్, టెరాసాఫ్ట్ కంపెనీ ఎండీ టి.గోపీచంద్ పేరిట హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో ఉన్న ఫ్లాట్, శ్రీనగర్ కాలనీలో ఉన్న మరో ఫ్లాట్.. అలాగే ఈ కేసులో నిందితుడు తుమ్మల గోపీచంద్ పేరిట హైదరాబాద్ యూసఫ్‌గూడలో ఉన్న ఫ్లాట్, గోపీచంద్ భార్య పవనదేవి పేరిట తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లో వ్యవసాయ భూమి ఉంది. వారి స్థిరాస్తులను అటాచ్ చేయడానికి రాష్ట్ర హోంశాఖ అనుమతి ఇచ్చింది.



## ఏఐజీ ఆస్పత్రిలో చంద్రబాబుకు వైద్య పరీక్షలు

హైదరాబాద్: తెదేపా అధినేత చంద్రబాబు వైద్య పరీక్షల కోసం గచ్చిబౌలిలో ఏఐజీ ఆస్పత్రికి వెళ్లారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి మధ్యంతర బెయిల్‌పై విడుదలైన ఆయన బుధవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసానికి చేరుకున్నారు.

అక్కడ ఏఐజీ వైద్యుల బృందం చంద్రబాబును కలిసి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంది. వారి సూచన మేరకు ఇవాళ చంద్రబాబు ఏఐజీకి వెళ్లి పరీక్షలు చేయించుకుంటున్నారు.

# ఆ కంపెనీలు ఎవరి బినామీలో తేలాలి?: లంకా దినకర్



విజయవాడ: విద్యుత్ ప్రాజెక్టుల కేటాయింపు అక్రమాలపై ఏపీ ప్రభుత్వం స్పందనేదని భాజపా నేత లంకా దినకర్ ప్రశ్నించారు. విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడారు. " లక్షల ఎకరాల నిలువు దోపిడీకి తెరలేపుతూ జీవోలు ఇచ్చారు. రాయలసీమలో సుమారు 1.50 లక్షల ఎకరాలు దోచే ప్రయత్నం చేస్తున్నారు. షిర్డీసాయి, ఇండోసెల్ కంపెనీలు ఎవరి బినామీలో తేలాలి? అస్మదీయులకే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, మీటర్ల సప్లయ్ టెండర్లు ఇస్తున్నారు. షిర్డీసాయి, ఇండోసెల్ కంపెనీలకు నిర్వహణ అనుభవమెంత? వారికి కట్టబెట్టిన ప్రాజెక్టుల విలువ ఎంతో చెప్పాలి. ఆ కంపెనీల ప్రమోటర్లు ఒక్కరే. సూట్‌కేసు కంపెనీల ద్వారా వచ్చే నిధులు ఎవరివో తేలాలి. పెట్టుబడుల సదస్సు ఒప్పందాలకు ముందే రాష్ట్ర ప్రభుత్వ జీవోలా? ఎవరితో మొదలైన ఒప్పందాలు ఎవరితో కొనసాగుతున్నాయి. అరబిందో కంపెనీకి 10 వేల ఎకరాలు కట్టబెడుతున్నారని సమాచారముంది. సుప్రీంకోర్టు తీర్పులను రాష్ట్ర ప్రభుత్వం తుంగలోకి తొక్కింది" అని దినకర్ ఆరోపించారు.




హైదరాబాద్: తెదేపా అధినేత చంద్రబాబు జైలు నుంచి వచ్చిన సమయంలో ప్రజలు నీరాజనాలు పలికారని ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. చంద్రబాబు తప్పు చేయలేదని ప్రజలు నమ్మారన్నారు. హైదరాబాద్ ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో పయ్యావుల మాట్లాడారు. రాజమహేంద్రవరం నుంచి ఉండవల్లి వరకు సాగిన 14 గంటల ప్రయాణంలో అడుగడుగునా ప్రజలు స్వాగతం పలికారని.. చరిత్రలో లేని విధంగా జనం వచ్చారని పయ్యావుల చెప్పారు. చంద్రబాబు ఎక్కడా కారు దిగలేదన్నారు. ప్రజాభిమానం కట్టలు తెంచుకుంటే ఎలా ఉంటుందో తాను చూశానని పయ్యావుల తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో ఒక్క రూపాయి కూడా అవినీతి జరగలేదని తాము ముందే చెప్పామన్నారు.

50 రోజులకు పైగా చంద్రబాబును జైలులో ఉంచారని.. 50 పైసలైనా ఆయనకు వచ్చాయని నిరూపించగలిగారా? అని పయ్యావుల కేశవ్ నిలదీశారు. పదేపదే అసత్యాలు ప్రచారం చేస్తే ఆరోపణలు నిజమవుతాయా? అని ఆయన మండిపడ్డారు.




# రోజా పర్సనల్ ఫోటోగ్రాఫర్‌ని చూశారా?

తిరుమల : మంత్రి రోజా.. తాను చెప్పిందే వేదం.. తాను చేసిందే శాసనం అనుకునే టైప్. ఇక తిరుమల వెంకన్న సన్నిధికి నెలకు ఒకసారైనా వెళ్లి రావడం గత కొంతకాలంగా ఆనవాయితీ అయిపోయింది రోజాకు.వెళితే వెళ్లారు కానీ ఆలయ పవిత్రతను కాపాడాలి కదా. పైగా దేవుడిపై అపారభక్తి అని.. వెంకన్నకు నమస్కరించనిదే తన దినచర్య ప్రారంభం కాదని చెబుతుంటారు. అలాంటి రోజా శిలువ గుర్తును తన మెడలో వేసుకున్న పర్సనల్ ఫోటోగ్రాఫర్‌తో తిరుమలలో హల్‌చల్ చేశారు. గొల్ల మండపం వద్ద సదరు ఫోటోగ్రాఫర్‌తో ఫోటోలు తీయించుకుని మురిసి పోయారు. ఇక రోజా దర్శనానికి వెళ్లడంతో సదరు ఫోటోగ్రాఫర్ అక్కడున్న మీడియా వారితో కాసేపు మాట్లాడాడు. ఆ సమయంలో వారంతా అతని మెడలోని శిలువ గుర్తుని చూసి అవాక్కయ్యారు. విషయాన్ని గమనించిన సాధారణ భక్తులు సైతం మండిపడుతున్నారు. మంత్రికి సంబంధించిన వ్యక్తి అయితే మాత్రం నిబంధనలకు పాతరేస్తారా? అంటూ ఫైర్ అవుతున్నారు.

# వైసీపీ తప్పుడు ఓట్లను నమోదు చేస్తుంది

రాజమండ్రి: వైసీపీ తప్పుడు ఓట్లను నమెదు చేస్తురీ, ఉన్న ఓట్లను తొలగిస్తుందని తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. గురువారం నాడు టీడీపీ పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..." రాష్ట్రవ్యాప్తంగా ఉన్న టీడీపీ కార్యకర్తలందరూ ఇంటింటికీ వెళ్లి ఓటర్ లిస్ట్ చెక్కు చేయాల్సిన అవసరం ఉంది. రాష్ట్రంలో నిరంకుశ పాలన సాగుతుంది. అన్ని వర్గాలను అణచివేసే ధోరణికి వైసీపీ ప్రభుత్వం పాల్పడుతుంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తప్పుడు విధానాలు, తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో జగన్మోహన్‌రెడ్డి ఓడిపోవడం ఖాయం.. జైలుకెళ్లడం ఖాయం.

పవన్ కళ్యాణ్ , లోకేష్, చంద్రబాబు బయటకు రాకూడదని జగన్ లేనిపోని నిబంధనలు పెడుతున్నాడు. జగన్మోహన్‌రెడ్డి బాబాయ్ వివేకా హత్య కేసును జగన్ మేనేజ్ చేస్తున్నారు. కోడికత్తి కేసు వాస్తవాలు బయటకు వస్తాయని అందుచేతనే సాక్ష్యం చెప్పకుండా జగన్ ప్రక్కదారి పట్టిస్తున్నారు.వచ్చే ఎన్నికల్లో జనసేన, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు గెలుస్తారు" అని గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు.



# మేకపాటి గౌతంరెడ్డి కాంస్య విగ్రహం ఆవిష్కరణ



నెల్లూరు: నెల్లూరు నగరంలోని డైకస్ రోడ్డు కూడలి లో దివంగత మంత్రి మేకపాటి గౌతం రెడ్డి కాంస్య విగ్రహాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. గౌతంరెడ్డి 52వ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, కుటుంబ సభ్యులతో కలిసి మంత్రి కాకాణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఈనాటి రాజకీయాల్లో మేలిమి ముత్యం.. మేకపాటి గౌతం రెడ్డి అని కొనియాడారు. రాజకీయాల్లోనే కాకుండా ప్రజా క్షేత్రంలోనూ తనదైన ముద్ర వేసుకున్న గౌతం రెడ్డి గుండెపోటుతో అకాల మరణం చెందడం జీర్ణించుకోలేకపోతున్నామన్నారు. రెండు సార్లు ఎమ్మెల్యేతో ఒకసారి మంత్రిగా పనిచేసిన ఆయన.. నూతన పరిశ్రమల ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కృషి చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నెల్లూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, మేయర్ స్రవంతి, ఎమ్మెల్సీలు బల్లి కల్యాణ్ చక్రవర్తి, పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మేరిగ మురళి, ఎమ్మెల్యేలు అనిల్ కుమార్, రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, మానుగుంట మహీధర రెడ్డి, వరప్రసాద్, కిలివేటి సంజీవయ్య, నగర కమిషనర్ వికాస్ మర్మత్, పలువురు ప్రజాప్రతినిధులు, ప్రముఖులు పాల్గొన్నారు.




శ్రీకాకుళం: రాజకీయాలకు అతీతంగా తెలుగు ప్రజలు తెదేపా అధినేత చంద్రబాబు వెంట ఉన్నారని ఆ పార్టీ ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. చంద్రబాబును ప్రజల నుంచి దూరం చేసేందుకు వైకాపా ప్రభుత్వం ప్రయత్నిస్తోందని.. తప్పుడు కేసులు పెడుతోందని ఆయన ఆరోపించారు. సుప్రీంకోర్టులో కచ్చితంగా న్యాయం జరుగుతుందనే నమ్మకం తమకు ఉందన్నారు. దివంగత కేంద్ర మాజీ మంత్రి ఎర్రన్నాయుడు 11వ వర్ధంతి సందర్భంగా శ్రీకాకుళంలో ఎంపీతో పాటు తెదేపా నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మీడియాతో మాట్లాడారు. "చంద్రబాబుపై జగన్ ప్రభుత్వం కేసుల మీద కేసులు పెడుతోంది. ఎన్ని కేసులు పెట్టినా వాటిపై పోరాటం చేసేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. రానున్న ఎన్నికల్లో తెదేపా గెలవబోతోంది.. చంద్రబాబు కచ్చితంగా సీఎం కాబోతున్నారు. ప్రజల నుంచి వస్తోన్న స్పందన.. జైలు నుంచి వచ్చిన సమయంలో ఆయనకు లభించిన ఆదరణే దీనికి నిదర్శనం. అర్ధరాత్రి దాటినా ప్రజలు రోడ్లపైనే నిద్రించి చంద్రబాబు కోసం వేచిచూశారు. గంటలపాటు నిరీక్షించి కన్నీటితో స్వాగతం పలికారు. ఏనాడైనా ఇలాంటి చూశామా? మీతో మేమున్నామంటూ ప్రజలు ధైర్యంగా చెప్పే పరిస్థితికి వచ్చారు. హైదరాబాద్‌లోనూ అలాంటి స్పందనే వచ్చింది. చంద్రబాబుపై వరుసగా కేసులు పెడుతూ జగన్ సెల్ఫ్ గోల్ వేసుకుంటున్నారు" అని రామ్మోహన్‌నాయుడు వ్యాఖ్యానించారు.




# సమన్లు వాపస్ తీసుకోవాలని లేఖ..!

దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో తనకు జారీ చేసిన సమన్లు వాపస్ తీసుకోవాలని దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఈడీకి లేఖ రాశారు. అవి పూర్తిగా రాజకీయ కక్షతో జారీ చేసినవని అభివర్ణించారు. వాస్తవానికి షెడ్యూల్ ప్రకారం ఈ రోజు (నవంబర్ 2) ఆయన ఈడీ కార్యాలయంలో హాజరుకావాల్సి ఉంది. ఈ క్రమంలో ఆయనకు సమన్లు జారీచేయడాన్ని వ్యతిరేకిస్తూ ఈడీ కార్యాలయం సమీపంలో ఆప్ కార్యకర్తలు గుమిగూడకుండా భారీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. తుగ్లక్ రోడ్డులోని ఈడీ కార్యాలయం వద్ద పోలీసు యంత్రాంగం పలు వరుసల్లో బారికేడ్లను ఏర్పాటు చేసింది. భారీ సంఖ్యలో పోలీసులు, పారా మిలిటరీ బలగాలను మోహరించినట్లు అధికారులు తెలిపారు. అలాగే డీడీయూ మార్గ్‌లోని భాజపా కార్యాలయానికి వెళ్లే మార్గంలో, ఐటీఓ ప్రాంతంలోని ఆప్ కార్యాలయం వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. దాంతో ఇండియా గేట్, వికాస్ మార్గ్, ఐటీఓ ప్రాంతంలో కొద్దిమేర ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. కేజ్రీవాల్ .. రాజ్‌ఘాట్ వద్ద నివాళి అర్పించేందుకు వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలియడంతో అక్కడ భద్రతను పెంచారు. ఈడీ సమన్లపై తాజాగా కేజ్రీవాల్ స్పందిస్తూ.. 'ఆ సమన్లు చట్టవిరుద్ధమైనవి. రాజకీయ ప్రేరేపితమైనవి. భాజపా సూచన మేరకే వాటిని పంపారు. త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి నన్ను దూరం చేసేందుకు వీటిని జారీ చేశారు. తక్షణమే సమన్లను ఉపసంహరించుకోవాలి' అని డిమాండ్ చేశారు. అలాగే నేడు ఈడీ ఎదుట హాజరుకాకూడదని నిర్ణయించుకున్న ఆయన.. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్‌మాన్‌తో కలిసి మధ్యప్రదేశ్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. దాంతో ఈడీ ఆయనకు కొత్త తేదీతో మరోసారి సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. ఈ సమన్ల నేపథ్యంలో ఇదివరకు ఆప్ నేతలు కేజ్రీవాల్ అరెస్టుపై అనుమానం వ్యక్తం చేశారు. "నవంబరు 2న కేజ్రీవాల్‌ను అరెస్టు చేసే అవకాశాలున్నట్లు సమాచారం అందింది. ఒకవేళ ఆయన అరెస్టయితే.. అవినీతి ఆరోపణలపై మాత్రం కాదు. భాజపాకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారనే..! దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భాజపాను ఆమ్ ఆద్మీ పార్టీ రెండు సార్లు ఓడించింది. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లోనూ ఆప్ చేతిలో ఆ పార్టీ ఓటమిపాలైంది. కేజ్రీవాల్‌ను చూసి ప్రధాని మోదీ భయపడుతున్నారు. ఎన్నికల్లో కేజ్రీవాల్‌ను ఓడించలేమని భాజపాకు అర్థమైంది. అందుకే ఇలా తప్పుడు కేసులు పెడుతోంది" అని దిల్లీ మంత్రి అతిషీ విమర్శించిన సంగతి తెలిసిందే.

# విశాఖలో జగన్ పర్యటన.. ప్రజలకు తప్పని తిప్పలు




విశాఖపట్నం: విశాఖలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. మధురవాడ ఐటీసీ వద్ద ఐటీ ఉద్యోగులు, స్థానికులపై పోలీసులు ఆంక్షలు విధించారు. రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్ళే వాహనాలకు ఆంక్షలు పెట్టారు. హోటల్ వైపు వెళ్లకుండా ప్రత్యేక ఆంక్షలు విధిస్తూ అక్కడకు వస్తున్న వాహనాలను పోలీసులు తరిగి వెనక్కి పంపించేస్తున్నారు. సీఎం జగన్ విశాఖకు ఎప్పుడు వచ్చినా తమకెందుకు ఇబ్బందులు పెడుతున్నారని ప్రజల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల ఆంక్షలతో నిర్ణీత సమయంలో ఉద్యోగులు ఆఫీసులకు వెళ్ళలేకపోయిన పరిస్థితి ఏర్పడింది. రుషికొండ దగ్గర రాడిసన్ బ్లూ హోటల్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ కమిషన్ ఆన్ ఇరిగేషన్ అండ్ డ్రైనేజీ కాంగ్రెస్ ప్లీనరీకి ముఖ్యమంత్రి జగన్ హాజరయ్యారు.

# జిగేల్ డ్రెస్సింగ్ డ్రెస్సింగ్ లో జాన్వీ హొయలు

బాలీవుడ్ బ్యూటీ జాన్వీకి స్పెషల్ గా పరిచయం అవసరం లేదు. శ్రీదేవి కూతురిగా సినిమాల్లోకి రాకముందు నుంచీ పరిచయమే. ఆ హోదాలోనే ఇండస్ట్రీలోనే అడుగుపెట్టింది. జాన్వీ తన సినీ కెరీర్ మొదలుపెట్టి ఐదేళ్లు అవుతోంది. అయితే, ఇప్పటి వరకు చెప్పుకోదగిన హిట్ మాత్రం అందుకోలేకపోయింది. తాజాగా, ఈ బ్యూటీ 'బవాల్'అనే మూవీలో నటించింది. ఈ మూవీలో ఆమెకు జోడిగా వరుణ్ ధావన్ నటించారు. సాజిద్ నడియద్ వాలా నిర్మించిన ఈ సినిమాకి, నితేశ్ తివారి దర్శకత్వం వహించాడు. డైరెక్ట్ గా ఓటీటీలో విడుదల కాగా, బాగానే ఆకట్టుకుంది. దక్షిణాదిన కూడా సత్తా చాటేందుకు ట్రై చేస్తోంది. కాగా, సోషల్ మీడియాలోనూ ఎప్పుడూ చురుకుగా ఉంటుంది. ఈ క్రమంలో ఆమె తాజాగా ఓ వీడియో విడుదల చేసింది. ఆ వీడియోలో ఆమె వివిధ రంగుల దుస్తుల్లో మెరిసిపోయింది. అన్నీ జిగేల్ జిగేల్ మనే దస్తులు కావడం విశేషం. ఈ వీడియో ఫ్యాన్స్ ని విపరీతంగా




ఆకట్టుకుంటోంది. ఒక్కో రంగు డ్రెస్ లో ఒక్కోలా ముస్తాబై, ఫోటోలకు ఫోజులు ఇవ్వడం విశేషం. ఇక, ఈ బ్యూటీ తెలుగులో దేవర మూవీతో గ్రాండ్ గా లాంఛ్ కాబోతోంది. తెలుగులో మొదటి సినిమానే ఆమెకు ఎన్టీఆర్ తో కలిసి నటించే అవకాశం రావడం విశేషం. ఈ సినిమా వచ్చే ఏడాది సమ్మర్ లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ మూవీలో సైఫ్ అలీఖాన్ విలన్ గా నటిస్తున్నాడు. ఈ మూవీలో జాన్వీ లుక్ ని గతంలోనే రివీల్ చేశారు. ఈ మూవీలో ఆమె డీగ్లామర్ లుక్ లో కనిపిస్తుందని తెలుస్తోంది. ఇదిలా ఉండగా, మరో వైపు ఈ బ్యూటీ తమిళంలోనూ అడుగుపెట్టాలని చూస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఓ సినిమా ఒకే అయినట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.బ్యాలెన్స్డ్ గా అటు తెలుగులోనూ, ఇటు తమిళంలోనూ తన కెరీర్ ని కంటిన్యూ చేయాలని ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వరసగా, రెండు హిట్లు పడితే, ఇక దక్షిణాదిన జాన్వీ కెరీర్ కి ఎలాంటి డోకా లేదనే చెప్పొచ్చు.

# ఆ నటుడి భార్య అప్పుడే సెకెండ్ లీడ్స్!

మాలీవుడ్ బ్యూటీ నజ్రియా నజీమ్ తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. 'అంటే సుందరానికీ' సినిమాతో లాంచ్ అయిన అమ్మడు అటుపై మళ్లీ కనిపించలేదు. ఆ సినిమా వైఫల్యంతో అవకాశాలు రాలేదు. ఆమె కూడా ఇక్కడ జర్నీని అంత సీరియస్ గా తీసుకుని ప్రయత్నాలు చేసినట్లు కనిపించలేదు. మరి ఇక్కడ తాను సాంధించలేనిది భర్త ఫహాద్ ఫాజిల్ సాధిస్తున్నాడని అనుకుందో! ఏమో గానీ ఇక్కడ కెరీర్ వెరీ లైట్ అనేసింది. అయితే మాలీవుడ్ లో మాత్రం కొన్నాళ్ల పాటు బాగానే సినిమాలు చేసింది. 2014 వరకూ బిజీ నటిగానే కొనసాగింది. పహాద్ తో వివాహం తర్వాత సినిమాలు అక్కడా పెద్దగా చేయలేదు. అప్పటి నుంచి ఇప్పటివరకూ సెలక్టివ్ గా నాలుగైదు సినిమాలు చేసింది. అప్పటివరకూ బిజీ నటిగా కొనసాగిన అమ్మడు ఒక్కసారిగా ఇలా వేగం తగ్గించే సరికి కుటుంబ జీవితాన్నే కోరుకుంటుందని భావించారు. కానీ టాలీవుడ్ లో ఎంట్రీ



ఇచ్చిన తర్వాత అమ్మడి కెరీర్ మళ్లీ అన్ని చోట్లా స్పీడప్ అవుతుందని భావిం చారు. కానీ అలా జరగలేదు. అన్ని చోట్లా అదే పరిస్థితి కనిపిస్తుంది. తాజాగా సూర్య హీరోగా సుధ కొంగర దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇందులో నజ్రియా సెకెండ్ లీక్ కి ఎంపికైందని కోలీవుడ్ లో ప్రచారం సాగుతోంది.

మెయిన్ లీడ్ లో శంకర్ కుమార్తె అదితి శంకర్ ని తీసుకున్నట్లు ప్రచారం లో ఉంది. ఆమె గనుక లాక్ అయితే నజ్రియా సెకెండ్ లీడ్ లోనూ..లేకపోతే మెయిన్ లీడ్ కి ప్రమోట్ అయ్యే అవకాశం ఉందని వినిపిస్తోంది. ఏది ఏమైనా నజ్రియాకిది సెకెండ్ ఇన్నింగ్స్ అని చెప్పాలి. వివాహం తర్వాత గ్యాప్ కొంతవరకూ ప్రతికూలత చూపుతున్నట్లే కనిపిస్తోంది. సొంత భాషలో కూడా సినిమాలు చేయకపోవడం ఆశ్చర్యంగానే ఉంది. అయితే నజ్రియా నిర్మాతగా మాలీవుడ్ లో మూడు సినిమాలు నిర్మించింది. ప్రస్తుతం నాల్గవ సినిమా సెట్స్ లో ఉంది. నిర్మాతగా బిజీ అవ్వడంతోనూ నజ్రియా నటనపై ఆనాసక్తి గా ఉండొచ్చు.




# పల్లెటూరి అందమంటే ఎంత ఇష్టమో..



సినిమాలో హీరోయిన్ పాత్రేంటి?.. హీరోతో లవ్.. గ్లామర్ ట్రీట్.. మధ్యలో ఓ మూడు నాలుగు పాటల్లో డ్యాన్సులు, క్లైమాక్స్‌లో ఓ ఎమోషన్ సీన్.. ఇదంతా ఒకప్పుడు ఫార్ములా. ఇప్పుడంతా మారిపోతోంది. వారి పాత్రలకు కథలో బలం పెరుగుతోంది. ముఖానికి రంగులు అద్దుకోవడం, గ్లామర్?గా హీరోలు పక్కన మెరవడం కాస్త తగ్గించి కంటెంట్ నచ్చితే నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలలో, అవసరమైతే డీగ్లామర్‌గా, ఊరమాస్‌గా కనిపిస్తున్నారు. యంగ్ హీరోయిన్స్ టు సీనియర్ కథానాయికలు అంతా ఇదే రూట్ ఫాలో అవుతున్నారు. సమంత, ఐశ్వర్య రాజేశ్, కీర్తి సురేశ్, తాప్సీ, అనుష్క సహా పలువురు ముద్దుగుమ్మలు ఈ లిస్ట్?లో ఉన్నారు. తాజాగా ఈ జాబితాలోకి బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ కూడా వచ్చి చేరిపోయింది. త్వరలోనే పక్కా పల్లెటూరి ఆడపిల్లలా.. మాస్ పాత్రలో కనువిందు చేయనుంది. త్వరలోనే ఆమె ఎన్టీఆర్ దేవర చిత్రంతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ మూవీ నుంచి రిలీజైన లుక్‌లో జాన్వీ పల్లటూరి యువతిగా లంగా ఓణిలో మరింత అందంగా కనిపించి ఆకట్టుకుంది. నిజానికి గత కొద్ది కాలంలో తెలుగులో హీరోయిన్లను పల్లెటూరి అమ్మాయిలుగా పక్కా మాస్‌గా చూపించింది సుకుమార్. ముందుగా రామ్ చరణ్ హీరోగా నటించిన రంగస్థలంలో హీరోయిన్‌గా సమంత నటించింది. అప్పటి వరకు గ్లామర్ రోల్స్‌కే పరిమితమైన సామ్.. ఈ చిత్రంలో పల్లెటూరి యువతిగా డీ గ్లామర్ రోల్ లో కనిపించి మెస్మరైజ్ చేసింది. ఆ తర్వాత పుష్పలో రష్మిక మందన్న పాత్ర కూడా పాలు అమ్ముకునే యువతిగా మాస్‌గా చూపించాడు సుకుమార్. త్వరలోనే రానున్న మంగళవారం చిత్రంలోనూ పాయల్ రాజ్‌పుత్ రోల్ ఇలానే కనిపించనుంది. ఇంకా గతంలో కీర్తిసురేశ్ సాయి కానిదన్, దసరా.. కొండపొలంలో రకుల్, ఓదల రైల్వే స్టేషన్‌లో హెబ్బా పటేల్, నారప్పలో ప్రియమణి, వరల్డ్ ఫేమస్ లవర్‌లో ఐశ్వర్య రాజేశ్.. ఇలా చాలా మందే పల్లెటూరి అమ్మాయిలుగా, ఊరమాస్‌గా, నటనకు ప్రాధాన్యమున్న, కథలో కీలక పాత్ర పోషించే పాత్రలలో నటించి ప్రేక్షకుల మనసు దోచారు.

# లింగిడి లింగిడి కోట బొమ్మాళి పీ.ఎస్.. సినిమా వచ్చేస్తుందోచ్..



మలయాళ సూపర్ హిట్ సినిమా నాయట్టు రీమేక్ గా గీతా ఆర్ట్స్ 2 సంస్థలో బన్నీ వాసు, విద్యా కొప్పినీడి నిర్మించిన సినిమా కోట బొమ్మాళి పీ.ఎస్. శ్రీకాంత్, వరలక్ష్మి శరత్ కుమార్, రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ లీడ్ రోల్స్ లో నటించిన ఈ సినిమాను తేజ మార్ని డైరెక్ట్ చేశారు. ఇదివరకు అతను తీసిన జోహార్ ప్రశంసలు అందుకోగా అర్జున ఫాల్గుణ నిరాశ పరచింది. పవర్ పోలీస్ కి, పొలిటికల్ లీడర్ కి మధ్య జరిగే పవర్ ఫుల్ పొలిటికల్ పవర్ గేమ్ గా కోట బొమ్మాళి పీ.ఎస్ వస్తుంది.

తెలంగాణలో ఎన్నికలు జరిగే సమయంలో నవంబర్ 24న ఈ సినిమా రిలీజ్ లాక్ చేశారు. పొలిటికల్ బ్యాక్ డ్రాప్ అనగానే ఈ టైం లో కోట బొమ్మాళి మీద స్పెషల్ క్రేజ్ ఏర్పడింది. ఈ సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తూ పోస్టర్స్ రిలీజ్ చేశారు మేకర్స్. నవంబర్ 24న ఈ సినిమా గ్రాండ్ గా రిలీజ్ అవుతుంది. టాలీవుడ్ ప్రముఖ బ్యానర్ అయిన GA 2 నుంచి ఏ సినిమా వచ్చినా దానికి ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. ఇప్పటికే ఎన్నో సూపర్ హిట్లు అందుకున్న ఈ బ్యానర్ లో వస్తున్న ఈ సినిమా కూడా ప్రేక్షకులను అలరిస్తుందని చిత్ర యూనిట్ చెబుతున్నారు. సినిమాలో శ్రీకాంత్ నటన అద్భుతంగా ఉంటుందని వరలక్ష్మి శరత్ కుమార్ కూడా మరో హైలెట్ గా నిలుస్తుందని అంటున్నారు. ఈమధ్య తెలుగు సినిమాల్లో వరలక్ష్మి శరత్ కుమార్ హవా కనిపిస్తుంది. క్రాక్ సినిమా నుంచి ఆమెకు తెలుగులో అవకాశాలు పెరిగాయి. రీసెంట్ గా వచ్చిన మ్యాన్షన్ 24 వెబ్ సీరీస్ లో కూడా ఆమె నటించింది.

మలయాళ సినిమా నాయట్టు అక్కడ సెన్సేషనల్ హిట్ గా నిలిచింది. మార్టిన్ ప్రకత్ డైరెక్ట్ చేసిన నాయట్టు సినిమాలో జోజు జార్జ్, నిమిషా సాయం నటించారు. సినిమా నుంచి వచ్చిన మోషన్ పోస్టర్ తో పాటుగా శ్రీకాకుళం లింగిడి లింగిడి సాంగ్ సెన్సేషనల్ హిట్ గా నిలిచింది. మిలియన్ల కొద్దీ వ్యూస్ రాబట్టిన ఈ సాంగ్ కోట బొమ్మాళి సక్సెస్ కి కారణమవుతుందా లేదా అన్నది చూడాలి.

# హీటెక్కిస్తున్న అలియా.. స్టన్ అయ్యేలా..

యూత్ లో మంచి క్రేజ్ ఉన్నా గ్లామర్ పాత్రల కన్నా వైవిధ్యమైన పాత్రలు పోషించి తన కెరీర్‌ను కొత్తదారిలో తీసుకెళ్లింది బాలీవుడ్ భామ అలియా భట్. ఆర్ఆర్ఆర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈ ముద్దుగుమ్మ.. రీసెంట్ గానే తల్లై మాతృత్వపు మాధుర్యాన్ని కూడా ఆస్వాదిస్తోంది. అయితే ఇప్పుడు ఆమెకు హాట్ వీడియోస్ నెట్టింట్లో తెగ చక్కర్లు కొడుతున్నాయి. అవి చూసిన నెటిజన్లు, అభిమానులు షాక్ అవుతున్నారు. వివరాల్లోకి వెళితే.. అలియా భట్.. తల్లయ్యాకా నటించిన చిత్రాల్లో రాకీ ఔర్ రాణీ కీ ప్రేమ్ కహానీ ఒకటి. రణ్‌వీర్ సింగ్ తో కలిసి ఈ చిత్రంలో నటించింది. ఈ ఏడాది జులైలో రిలీజైన ఈ రొమాంటిక్ కామెడీ ఫ్యామిలీ డ్రామా.. బాక్సాఫీసు వద్ద మంచి హిట్‌గా నిలిచింది. రూ. 300కోట్ల రూపాయలు వరకు



వసూలు చేసింది. అలాగే ప్రతిష్ఠాత్మకమైన బుసాన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రదర్శితం కానున్న సినిమాల జాబితాలో నిలిచింది. ప్రముఖ నిర్మాత, నటుడు, దర్శకుడు కరణ్ జోహార్.. చాలా కాలం తర్వాత మెగా ఫోన్ పట్టి ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సీనియర్ నటులు ధర్మేంద్ర, జయా బచ్చన్, షబానా అజ్మీ ఇతర కీలక పాత్రలు పోషించారు. అయితే ఈ చిత్రంలో అలియా స్మోకింగ్, కొన్ని హాట్ సీన్స్ లో నటించింది. ఇప్పుడీ సినిమా అమెజాన్ ప్రైమ్ లో సైలంట్ గా వచ్చేసింది. మంచి రెస్పాన్స్ కూడా వస్తోంది. ఈ క్రమంలోనే సినిమలోని అలియా గ్లామర్ బాగా ఫోకస్ అయింది. అందరీ దృష్టిని ఆకర్షించింది. ఎందుకంటే సినిమాలోని అలియాకు సంబంధించిన స్మోకింగ్, హాట్ అండ్ రొమాంటిక్ సీన్స్ నెట్టింట్లో బాగా వైరల్ గా మారాయి. ఇది చూసిన నెటిజన్లు, అలియా అభిమానులు షాక్ అవుతున్నారు. పెళ్లితో పాటు తల్లైన అలియా.. ఇలాంటి సన్నివేశాల్లో నటిస్తుందని వారంతా ఊహించుకోకలేకపోయారు. అదే సమయంలో అలియా ఎంతో అందంగా సూపర్ హాట్ గా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు. కాగా, అలియా భట్.. ఇటీవలే ఉత్తమ నటిగా జాతీయ అవార్డుకు ఎంపికైన సంగతి తెలిసిందే. గంగూబాయి కాఠియావాడి సినిమాలోని నటనకుగాను ఆమెకు ఈ పురస్కారం దక్కింది. అలాగే ఆమె ఇటీవలే హార్ట్ స్టోన్ అనే ఓ హాలీవుడ్ సినిమాతోనూ అభిమానుల ను పలకరించింది. ఇందులో ఆమె నటనకు మంచి మార్కులే పడ్డాయి.

# వాణీకపూర్ నెవ్వర్ బిఫోర్ హాట్ లుక్ వైరల్

'వార్' బ్యూటీ వాణీ కపూర్ ఫ్యాషన్ సెన్స్ నేటితరానికి స్ఫూర్తి. నటన, డ్యాన్స్, ఫిట్‌నెస్ లేదా మోడలింగ్ ఏ కోణంలో చూసినా వాణి కపూర్ ని వేలెత్తి చూపలేం. తన అద్భుత నటనా నైపుణ్యంతో పాటు ఫ్యాషన్ సెన్స్, ప్రత్యేకమైన శైలి అందరికీ ఒక ప్రేరణ. పక్కింటి అమ్మాయి లుక్ అయినా బికినీ లుక్ అయినా వాణీ ప్రత్యేకత గురించి యూత్ మాట్లాడుతుంది. తాజాగా వాణి కపూర్ బాడీకాన్ దుస్తులు ధరించి వంపులను ఆవిష్కరించిన తీరు హాట్ టాపిక్ గా మారింది. స్ట్రాపీ స్లీవ్‌లు, %ఖ%-నెక్‌లైన్ టాప్ ధరించి బ్లాక్ కలర్ గాగుల్స్ తో వాణీ ఎంతో స్టైలిష్ గా కనిపిస్తోంది. క్యూట్ అండ్ హాట్ పర్ఫెక్ట్ ఫ్యూజన్ లుక్ ఇది. ప్రస్తుతం ఈ గెటప్ అంతర్జాలంలో వైరల్ గా మారింది. వాణీ ప్రతిసారీ లుక్ పరంగా వైవిధ్యం కోసం పాకులాడుతుంది. అంతేకాదు ఇటీవల పూర్తిగా సైజ్ జీరో లుక్ లోకి మారిపోయాక ఆరోగ్యం ఫిట్ నెస్ పరంగాను ఈ బ్యూటీ చాలా ప్రయాసలు పడుతోందని అర్థమవుతోంది. వాణీ ఇటీవల బ్యాక్ టు



బ్యాక్ మూడు పాన్ ఇండియా చిత్రాల్లో వాణీ నటిస్తోంది. 2013లో రొమాంటిక్ కామెడీ చిత్రం 'శుద్ధ్ దేశీ రొమాన్స్'లో తన సినీ రంగ ప్రవేశం చేసిన వాణీ ఉత్తమ అరంగేట్ర నాయికగా ఫిల్మ్‌ఫేర్ అవార్డును అందుకుంది. ఆ తర్వాత బేఫిక్రే చిత్రంలో తనదైన నటనతో మెప్పించింది. తెలుగులో ఆహా కళ్యాణం లో నటించినా కానీ సినిమా డిజాస్టరైంది. తెలుగుకు ఈ భామ సూట్ కాలేదని విమర్శల పాలైంది. ఆ తర్వాత యాక్షన్ చిత్రాలైన వార్ - బెల్ బాటమ్ లలో వానీ నటనకు ప్రశంసలు అందుకుంది. రొమాంటిక్ కామెడీ చిత్రం 'చండీగఢ్ కరే ఆషికి'లో లింగమార్పిడి మహిళగా అద్భుత నటనతో మరోసారి నటిగా మంచి పేరు తెచ్చుకుంది. ఈ చిత్రంలో వాణీ పోషించిన పాత్ర అన్ని వర్గాల దృష్టిని ఆకర్షించింది. అలాగే లింగమార్పిడి అమ్మాయి పాత్రను పోషించిన ఏకైక ప్రముఖ బాలీవుడ్ నటిగా రికార్డులకెక్కింది. ఈ చిత్రంలో ఆమె అద్భుతమైన నటనకు ఇండస్ట్రీ వర్గాల నుంచి బోనస్ ప్రశంసలు కురిసాయి. 'చండీగఢ్ కరే ఆషికి' , షంషేరాలోను అద్భుతంగా నటించింది. దినేష్ విజన్ ప్రాజెక్ట్ ... అషిమ్ అహ్లువాలియాతో అలాగే మరొకటి నిఖిల్ అద్వానీ ప్రొడక్షన్స్ తో సినిమాలు చేస్తోంది. ఇటీవల పలువురు దర్శకులు వినిపించిన కథలు విన్న వాణీ వాటికి గ్రీన్ సిగ్నల్ ఇవ్వాల్సి ఉందిట.




## తెలంగాణ ఎన్నికల్లో ఆ మూడు పార్టీలూ కలిసి పనిచేస్తున్నాయి: రాహుల్ గాంధీ

మంథని: ఈ అసెంబ్లీ ఎన్నికలు దొరల తెలంగాణకు, ప్రజల తెలంగాణకు మధ్య జరుగుతున్నాయని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. ఈ ఎన్నికల్లో భారాస, భాజపా, ఎంఐఎం కలిసి పనిచేస్తున్నాయని ఆయన ఆరోపించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం అంబట్‌పల్లిలో రాహుల్ పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మహిళా సాధికారత సదస్సులో ఆయన మాట్లాడారు. "తెలంగాణలో రూ.లక్ష కోట్ల సంపద దోపిడీకి గురైంది. కాళేశ్వరం ప్రాజెక్టు సీఎం కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి ఏటీఎంగా మారింది. రాష్ట్ర సంపదను దోచుకుని తెలంగాణలో ప్రతి కుటుంబంపై అప్పు భారాన్ని మోపారు. కేసీఆర్ దోచుకున్న సొమ్మును తిరిగి ప్రజలకు చెందేలా చూస్తాం. అందుకే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహాలక్ష్మి పథకం ద్వారా ప్రతీ మహిళకు నెలకు రూ.2500 అందించనున్నాం. ప్రధాని మోదీ, కేసీఆర్ పాలనలో సిలిండర్ ధర రూ.1,200కు చేరింది.

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం" అని రాహుల్ అన్నారు. అంతకుముందు మేడిగడ్డ బ్యారేజ్‌ను రాహుల్ గాంధీ పరిశీలించారు. రాహుల్ వెంట టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, మాజీ మంత్రి శ్రీధర్ బాబు తదితర నేతలు ఉన్నారు.




నిర్మల్: పదేళ్లుగా శాంతియుతంగా రాష్ట్రాన్ని పాలిస్తున్నామని సీఎం కేసీఆర్ అన్నారు. ప్రజల హక్కుల కోసమే భారత్ రాష్ట్ర సమితి (భారాస) పుట్టిందన్నారు. 15 ఏళ్లు నిర్విరామంగా పోరాడి తెలంగాణను సాధించుకున్నామన్నారు. పదేళ్ల తెలంగాణను ఆశీర్వదించారని ప్రజలకు కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. నిర్మల్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగించారు. "తెలంగాణ గ్రామాలు పచ్చబడాలంటే ఏం చేయాలనేదానిపై ఎంతో ఆలోచన చేశాం. రాష్ట్రంలో వ్యవసాయాన్ని స్థిరీకరించాలనే ఉద్దేశంతోనే రైతుబంధు తీసుకొచ్చాం. అది ఎన్నికల కోసం తీసుకొచ్చింది కాదు. తెలంగాణలో నీళ్లు ఉచితమే. కరెంటు ఉచితమే. రైతులు పండించిన పంటను కూడా కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికే రైతుల రుణమాఫీ చేశాం. మరికొంత మందికి మాఫీ చేయాల్సి ఉంది. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో మరికొంత మందికి పూర్తి చేయలేక పోయాం. ఈసీ అనుమతిస్తే ఇప్పుడే రైతు రుణమాఫీ పూర్తి చేస్తాం. గతంలో రైతులకు సాయం చేయాలని ఎవరూ ఆలోచించలేదు. కాంగ్రెస్ నేతలు ఇవాళ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారు. రైతుబంధు దుబారా ఖర్చు అని అంటున్నారు. ధరణి తీసేస్తే.. రైతుబంధు, రైతుబీమా కూడా పోతాయి. ధరణి తీసేస్తే మళ్లీ దళారుల రాజ్యం వస్తుంది. గిరిజనులకు నాలుగు లక్షల ఎకరాలకు పోడు పట్టాలు ఇచ్చాం. అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ భారాస గెలవాలి" అని సీఎం కేసీఆర్ అన్నారు.

## కేసీఆర్ అంటే కాళేశ్వరం కర్రెప్షన్ రావు అనే పరిస్థితి వచ్చిందన్న రేవంత్




హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌పై టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి విరుచుకుపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ అంటే కాళేశ్వరం కర్రెప్షన్ రావు అనే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యలు చేశారు. నాసిరకం పనులతో వేల కోట్ల ప్రజాధనాన్ని వృథా చేశారని మండిపడ్డారు. సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోయాయన్నారు. 25వ పిల్లర్ నుంచి 1వ పిల్లర్ వరకు పూర్తిగా కుంగిపోయిందని తెలిపారు. పిల్లర్స్ రెండున్నర ఫీట్లు కుంగిపోయిందని అధికారులే స్వయంగా చెబుతున్నారన్నారు. మేడిగడ్డ సగం ప్రాజెక్టు కూల్చాల్సిన పరిస్థితి ఏర్పడిందని.. మిగతా సగం ప్రాజెక్టు పరిస్థితి కూడా సాంకేతిక నిపుణులు పరిశీలిస్తే తప్ప ఏంటనేది తెలుస్తుందన్నారు. ప్రాజెక్టు నిర్మాణం చేసిన ఎల్ అండ్ టీ కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని టీపీసీసీ చీఫ్ డిమాండ్ చేశారు. సంబంధిత ఇంజనీర్లు, సీడీఓపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నారు. కేసీఆర్ కుటుంబం అవినీతికి కాళేశ్వరం ప్రాజెక్టు బలైపోయిందన్నారు. గుడినీ గుడిలో లింగాన్ని దిగమింగిన కేసీఆర్‌ను తెలంగాణ సమాజం శిక్షించాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాపం పండింది... కేసీఆర్ అవినీతి కుండ పగిలింది.. మేడిగడ్డ కుంగిందంటూ విరుచుకుపడ్డారు. లక్ష కోట్ల ప్రజాధనం గోదావరిలో పోసిన పన్నీరయిందన్నారు. బీఆర్ఎస్ అవినీతిని బీజేపీ కాపాడుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ అవినీతికి ప్రాజెక్టు బలైందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్ బలి తీసుకుంటే.. కేసీఆర్‌ను కాళేశ్వరం ప్రాజెక్టు బలి తీసుకుంటుందన్నారు. మహేశ్వరంలో సబితా ఇంద్రారెడ్డి ఓడిపోతారని బీఆర్ఎస్‌కు స్పష్టత వచ్చిందని తెలిపారు. అందుకే కేసీఆర్ కేంద్రం సహకారంతో కాంగ్రెస్ నాయకులపై ఐటీ దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. ఎట్టి పరిస్థితుల్లో రాష్ట్రంలో కేసీఆర్‌ను ఓడించి తీరుతామని స్పష్టం చేశారు. మోడీ కంకణం కట్టుకుని కేసీఆర్‌ను గెలిపించాలనుకున్నా అది జరగదన్నారు. తమరెన్ని కుట్రలు చేసినా తెలంగాణ సమాజం తిప్పికొడుతుందని.... కేసీఆర్‌ను పడగొడుతుందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## రాహుల్ క్షమాపణ చెప్పాలి.. ఆ తరువాతే బీసీల ఓట్లు అడగాలి: బండి సంజయ్



హైదరాబాద్: అధికారంలోకి వస్తే ఓబీసీ కులగణన చేపడతామంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వింటే నవ్వొస్తోందని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ ఎద్దేవా చేశారు. దేశాన్ని 50 ఏళ్లకుపైగా పాలించిన పార్టీ కాంగ్రెస్సే అయినా ఏనాడూ ఓబీసీ కులగణన చేయాలనే ఆలోచన చేయలేదన్నారు. అధికారం కోల్పోయి పార్టీ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని తెలిసి ఓబీసీల జపం చేస్తున్నారని విమర్శించారు. ఇది కాంగ్రెస్ పార్టీ స్వార్థ రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనమన్నారు. తెలంగాణలో 2 శాతం ఓట్లు కూడా రాని భాజపా బీసీని సీఎం ఎట్లా చేస్తుందని రాహుల్ చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమేనని ఒక ప్రకటనలో సంజయ్ మండిపడ్డారు. మొన్న కేసీఆర్ కుమారుడు కేటీఆర్, నిన్న రాహుల్ చేసిన వ్యాఖ్యలు.. తెలంగాణలో బీసీని సీఎం కాకుండా చేస్తున్న కుట్రలో భాగంగానే ఉన్నాయని విమర్శించారు. బీసీలకు తక్షణమే రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ తరువాతే బీసీల ఓట్లు అడగాలన్నారు.

## చంద్రబాబుపై ఈటల వ్యాఖ్యలను ఖండించిన టీటీడీపీ నేత



హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో టీడీపీ అధినేత చంద్రబాబు వేలు పెడుతున్నారంటూ బీజేపీ నేత ఈటల రాజేందర్ చేసిన వ్యాఖ్యలను టీటీడీపీ సీనియర్ నేత అర్వింద్ కుమార్ గౌడ్ తీవ్రంగా ఖండించారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ నేతలు ఎన్టీఆర్ జపం చేయటం లేదా? అని ప్రశ్నించారు. బీసీ వర్గాలను ప్రోత్సహించిన టీడీపీపై ఈటల కామెంట్స్ శోచనీయమన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం బీఆర్ఎస్ సహా కాంగ్రెస్ నేతలు.. చంద్రబాబు జపం చేస్తున్నారని తెలిపారు. ఓట్ల కోసం చంద్రబాబుకు అనుకూలంగా మాట్లాడుతున్నారన్నారు. బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని మొదట ప్రకటించిందే టీడీపీ అని చెప్పుకొచ్చారు. కొన్ని ప్రత్యేక కారణాల వలనే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటున్నామని తెలిపారు.

చంద్రబాబు సమయం ఇవ్వలేరన్న కారణంగానే పోటీకి దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. బడుగు బలహీన వర్గాలకు కేరాఫ్ అడ్రస్ తెలుగుదేశం పార్టీ అని అన్నారు. సేవాభావంతో పుట్టిన పార్టీ తెలుగుదేశం అని అర్వింద్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

## కాంగ్రెస్‌తో కమ్యూనిస్టులు కటీఫ్.. ఒంటరిగానే బరిలోకి.. జాబితా విడుదల




"అనుకున్నదొక్కటి అయినది ఒక్కటి.. బోల్తా కొట్టిందిలే బుల్బుల్ పిట్ట" ఈ సినిమా పాట గుర్తుంది కదా?. అచ్చం అదే పాట మాదిరిగా ఉన్నాయి తెలంగాణలోని కొన్ని పార్టీల పరిస్థితి. మునుగోడు ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ.. కమ్యూనిస్టు పార్టీల సహాయంతో విజయం సాధించింది. అదే పొత్తు తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కూడా కొనసాగుతుందని ఆశలు పెట్టుకున్నాయి. కానీ వారి ఆశలన్నీ అడియాశలయ్యాయి. కనీసం వాళ్లతో సంప్రదించకుండానే సీఎం కేసీఆర్.. బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించేశారు. దీంతో గులాబీ పార్టీపై లెఫ్ట్ పార్టీలు గరం గరం అయ్యారు.


**కాంగ్రెస్‌తో కటీఫ్..** తదనంతరం కాంగ్రెస్‌తో దోస్తీ కట్టేందుకు కామ్రేడ్లు చర్చలు జరిపారు. ఇరు పక్షాల నుంచి ముఖ్య నేతలు సీట్ల కేటాయింపుపై మంతనాలు జరిపారు. ఇప్పటిదాకా ఆ సీట్లు.. ఈ సీట్లు అంటూ లీకులు ఇచ్చుకుంటూ ఇన్ని రోజులు ఊరించి.. ఊరించి.. చివరికి ఉసురుమనిపించారు. కాంగ్రెస్ దగ్గర కూడా రిక్తహస్తమే మిగిలింది. వామపక్షాలు కోరిన సీట్లు ఇచ్చేందుకు హస్తం పార్టీ మొగ్గుచూపించినట్లు కనిపించలేదు. దీంతో చెయ్యి పార్టీకి కటీఫ్ చెప్పాలని కమ్యూనిస్టులు నిర్ణయానికి వచ్చేశారు. ఇప్పటికే సీపీఎం కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పేసింది. 17 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఇక సీపీఐ కూడా అదే బాటలో ఉన్నట్లు సమాచారం. రేపు సీపీఐ రాష్ట్ర కమిటీ సమావేశం అవుతోంది. ఈ భేటీలో కాంగ్రెస్‌తో వెళ్లేదో.. లేదో స్పష్టమైన ప్రకటన చేయనుంది.

**వైఎస్సార్‌టీపీకి కూడా సేమ్ సీన్..** గతంలో కూడా వైఎస్సార్‌టీపీ పరిస్థితి ఇలానే అయింది. వైఎస్సార్‌టీపీ.. కాంగ్రెస్‌లో విలీనంపై హస్తిన వేదికగా సోనియా, రాహుల్‌తో షర్మిల చర్చలు జరిపారు. విలీనం అంటూ చాలా రోజులు వార్తలు షికార్లు చేశాయి. కానీ చివరికి చెయ్యి పార్టీ మొండిచెయి చూపించింది. దీంతో షర్మిల ఒంటరిగా బరిలోకి దిగాలని నిర్ణయం తీసుకున్నారు. పాలేరు నుంచి షర్మిల.. కొడంగల్ నుంచి బ్రదర్ అనిల్ పోటీ చేస్తున్నట్లు తెలుస్తోంది. కొడంగల్‌లో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఓడించడమే లక్ష్యంగా షర్మిల రాజకీయ వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.

వైఎస్సార్‌టీపీ.. కాంగ్రెస్‌లో విలీనం కాకుండా అడ్డుకున్నది రేవంతేనని షర్మిల భావిస్తోంది. దీనికి ప్రతీకారంగా రేవంత్‌ను ఓడించాలని ఆమె ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం. ఏం జరుగుతుందో మరికొన్ని రోజుల్లో తేలిపోనుంది.

**తమ్మినేని వీరభద్రం కామెంట్స్..** "బీజేపీ పోటీ చేసే స్థానాల్లో కాంగ్రెస్ లేదా బీఆర్ఎస్‌కు ఓటు వేసి గెలిచేలా చూస్తాం. ఆ స్థానాల్లో బీజేపీకి ప్రాతినిధ్యం ఉండకూడదు అనేది మా నినాదం. బీజేపీ కాకుండా ఎవరు గెలిచే అవకాశం ఉంటుందో వారికీ ఆ నియోజకవర్గాల్లో మద్దతు ఉంటుంది. సీపీఐ మాతో వచ్చినా ఓకే. రాకపోయినా ఓకే. కాంగ్రెస్‌తో కలిసి పోటీ చేసినా లేదా సీపీఐ ఒంటరిగా బరిలోకి దిగినా సీపీఐకే ఓటు వేయాలని ప్రచారం చేస్తాం." అని తమ్మినేని వీరభద్రం అన్నారు.

## బీసీలను రాహుల్ అవమానించారు...



న్యూఢిల్లీ: కేంద్రమంత్రి అమిత్ షా బీసీ సీఎం ప్రకటనపై రాహుల్ గాంధీ అవహేళనతో, చులకన భావంతో మాట్లాడారని బీజేపీ రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ మండిపడ్డారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ... రాహుల్ గాంధీ బీసీలను అవమానపరిచారన్నారు. అవకాశం వచ్చినప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ బీసీలకు అవకాశం ఇవ్వలేదన్నారు. బీసీలు బీజేపీకి దగ్గరవుతారన్న అక్కసుతో రాహుల్ గాంధీ ఈ ప్రకటన చేశారని విమర్శించారు. బీసీలు తమకున్న ఓటు ఆయుధంతో రాహుల్ గాంధీ, కేసీఆర్‌లు చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ప్రకటించే తాయిలాల కోసం తాము ఆరాటపడడం లేదని బీసీలు నిరూపించుకోవాలన్నారు. బీసీలు తమ ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకోవాలని అన్నారు. తెలంగాణలో జరిగిన ఉపఎన్నికలలో కాంగ్రెస్ పార్టీకి డిపాజిట్ గల్లంతైన విషయాన్ని రాహుల్ గాంధీ గుర్తుంచుకోవాలన్నారు. బీసీల రిజర్వేషన్లను వ్యతిరేకించిన పార్టీ కాంగ్రెస్ అన్నారు. బీసీ వ్యక్తి ప్రధాని అయితే రాహుల్ గాంధీ జీర్ణించుకోలేక పోతున్నారని వ్యాఖ్యలు చేశారు. ఓట్లకోసం ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలను రాహుల్ గాంధీ విరమించుకోవాలని హితవుపలికారు. 1358 ఓబీసీ శాసన సభ్యులు బీజేపీ తరపున గెలిచారని... 160 మందికి శాసనమండలి సభ్యులుగా అవకాశం ఇచ్చామని పేర్కొన్నారు. తెలంగాణలో ఈనెల 7న సాయంత్రం బీసీల ఆత్మగౌరవ సభ పేరుతో హైదరాబాద్ సభ నిర్వహించనున్నామని.. ఈ సభకు ప్రధాని మోదీ హాజరవుతారని ఎంపీ తెలిపారు.

**జనసేనతో పొత్తు లాభమే...** జనసేనతో పొత్తు బీజేపీకి లాభిస్తుందని అన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన పోటీ నుంచి వైదొలగడం కారణంగా బీజేపీ అన్ని సీట్లు సాధించగలిగిందని తెలిపారు. జనసేనతో పొత్తు నేపథ్యంలో టికెట్ ఆశించిన బీజేపీ అభ్యర్థులు నిరాశ పడవద్దని సూచించారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తుంది. పదవులు, అవకాశాలు చాలా వస్తాయన్నారు. తెలుగుదేశం పార్టీతో బీజేపీకి పొత్తు లేదని స్పష్టం చేశారు. తెలంగాణ ఎన్నికల్లో తెలుగుదేశం ఎవరికి మద్దతు ఇస్తుందో ప్రకటించలేదన్నారు. జనసేన ఎన్డీఏ భాగస్వామిగా ఉందని.. పొత్తు ధర్మాన్ని పాటించి సీట్ల సర్దుబాటు చేసుకుంటామన్నారు. నిన్న, మొన్నటి వరకు పార్టీ మారబోనంటూ వివేక్ వెంకటస్వామి స్వయంగా ప్రకటించారని.. ఇప్పుడు ఆయన మనసు మార్చుకుంటే మీరు ఆయన్ని అడగాలని ఎంపీ లక్ష్మణ్ పేర్కొన్నారు.

## అధికార మదంతో కేసీఆర్ విర్రవిగుతున్నారు



హైదరాబాద్ : అధికార మదంతో కేసీఆర్ విర్రవిగుతున్నారని మాజీకేంద్ర మంత్రి రేణుకాచౌదరి అన్నారు. గురువారం నాడు గాంధీభవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ..."రాహుల్ గాంధీ కాళేశ్వరం పర్యటన కేవలం రాజకీయ స్వలాభం కోసం కాదు. ప్రతి మనిషిపై BRS పార్టీ లక్షకు పైగా అప్పు భారం వేసింది. దొంగ విత్తనాలు మూలంగా 8 వేల మంది రైతు కుటుంబాల నాశనం అయితే కేసీఆర్ నోరు మేధపని పరిస్థితి. ఈ ప్రభుత్వం కౌలు రైతుని మర్చిపోయింది. కాంగ్రెస్ పార్టీ కౌలు రైతులకు దృష్టిలో పెట్టుకుంది. కాళేశ్వరం వల్ల బంగారం అంత కేసీఆర్ ఇంటికి చేరింది. గతంలో తెలంగాణ ఇచ్చిన సోనియాగాంధీ పక్కన పెట్టి గెలిపిస్తే రైతులకి కేసీఆర్ చేసింది ఏంటి? ధరణి పోర్టల్‌తో కేసీఆర్ భూములు కాజేసింది నిజం కాదా.? మీపార్టీ నేతలు చేసిన దోపిడీ ప్రజలు గమనిస్తున్నారు. కాళేశ్వరం విషయంలో క్వాలిటీ కంట్రోల్ ఏం అయింది. కాళేశ్వరం భవిష్యత్ ఏంటి...? పక్కన ఊరు ప్రజల గురించి ఆలోచించారా...? పంటకు రేట్లు ఆడిగితే జైలు శిక్షలు ..నాలల్లో నీళ్లు రాని పరిస్థితి. కేసీఆర్ కాంగ్రెస్ గొంతు నొక్కే ప్రయత్నాలు చేస్తున్నారు. ధరణి పోర్టల్ ఎందుకు పనిచేయటం లేదు.. ఈ పోర్టల్ సామాన్యుడికి మేలు జరిగిందా ఆలోచించాలి. కేజీ టూ పీజీ అన్నారు.. BRS నేతలు చదువుకుంటే బాగుండేది. కాళేశ్వరం ఫెయిల్యూర్ అని ఒప్పుకొని చెంపలు వేసుకో కేసీఆర్" అని రేణుకా చౌదరి ఎద్దేవ చేశారు.




హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ఎన్నికల ప్రచారానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రానున్నారు. ఈ నెల 7, 11 తేదీల్లో భాజపా నిర్వహించే సభల్లో పాల్గొననున్నారు. ఈ తేదీల్లో హైదరాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల్లో సభలు నిర్వహించేందుకు భాజపా రాష్ట్ర నాయకత్వం ప్రణాళిక చేస్తోంది. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీ ముఖ్యమంత్రిని చేస్తామని ప్రకటించిన తరువాత రాష్ట్రానికి ప్రధాని రానుండటం ఇదే తొలిసారి.

**15 నుంచి ప్రచారం ఉధృతం :** అలాగే నామినేషన్ల పర్వం ముగిసిన తరువాత ఈ నెల 15 నుంచి తెలంగాణలో ఎన్నికల ప్రచారాన్ని భాజపా ఉధృతం చేయనుంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పలువురు కేంద్రమంత్రులు, జాతీయ నాయకులు ప్రచారపర్వంలో పాల్గొననున్నారు. ఈ నెల 19వ తేదీ తరువాత మరోసారి ప్రధాని తెలంగాణలో ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

**రాష్ట్ర పార్టీకి మూడు హెలికాప్టర్లు :** ఎన్నికల ప్రచారం కోసం భాజపా జాతీయ నాయకత్వం రాష్ట్ర పార్టీకి మూడు హెలికాప్టర్లను సమకూర్చింది. ఒకటి పూర్తిగా బండి సంజయ్‌కు కేటాయించగా.. మరో రెండు కిషన్ రెడ్డి, లక్ష్మణ్, ఈటల రాజేందర్, ముఖ్య నేతల ప్రచారానికి వినియోగించనున్నట్లు సమాచారం.

జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో బండి సంజయ్ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించేందుకు వీలుగా ప్రత్యేకంగా ఒక హెలికాప్టర్‌ను ఇచ్చినట్లు పార్టీ శ్రేణులు తెలిపాయి.

## కాళేశ్వరం పేరు చెప్పుకొని బీఆర్ఎస్ ఓట్లు దండుకుంటుంది



హైదరాబాద్: కాళేశ్వరం పేరు చెప్పుకొని బీఆర్ఎస్ పార్టీ ఓట్లు దండుకుంటుందని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చౌహాన్ అన్నారు. గురువారం నాడు గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ...రోజురోజుకీ కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెరుగుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తాం. రాహుల్‌గాంధీ కాళేశ్వరం సందర్శన వెళ్లిన తర్వాత అనేక నిజాలు బయటపడుతున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ కుటుంబానికి ఏటీఎం లాగా ఉపయోగపడుతోంది. కమీషన్ల కోసం కాళేశ్వరం అంచనాలను పెంచారు. కాంగ్రెస్ పార్టీ మొదలుపెట్టిన అంబేద్కర్ సుజల స్రవంతి ప్రాజెక్టును బీఆర్ఎస్ పార్టీ కాళేశ్వరంగా మార్చింది. కాళేశ్వరంపై విమర్శలు చేస్తున్న బీజేపీ ఎలాంటి విచారణ చేయడం లేదు. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌లో లోపాలు ఉన్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు కోసం వృథా చేసిన సొమ్ము తెలంగాణ ప్రజలపై అప్పుగా మారింది. కాళేశ్వరం డబ్బులు ఎక్కడ పోయాయి. రైతుల కోసం నీళ్లు ఇవ్వడానికి అని చెప్తూ అన్నివర్గాల ప్రజలను సీఎం కేసీఆర్ మోసం చేస్తున్నారు. తెలంగాణలో మేం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తప్పకుండా అమలు చేస్తాం. ఇచ్చిన మాటని నిలబెట్టుకునే ట్రాక్ రికార్డ్ కాంగ్రెస్ పార్టీకి ఉంది" అని అశోక్ చౌహాన్ పేర్కొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com